
ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 18.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 268 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



ఇండియా, సౌతాఫ్రికా నాలుగో టీ20 రద్దు 8

వారు పార్టీ మారినట్లు ఆధారాలు లేవు

ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు కొట్టివేత

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కీలక తీర్పు



- మరో ముగ్గురి అనర్హత పిటిషన్‌పై తీర్పు గురువారం
- సాంకేతికంగా బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు స్పష్టీకరణ
- ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి
- సమయం కావాలన్న దానం, కడియం
- అభివృద్ధి పనుల కోసమే సీఎంతో సమావేశం
- విచారణలో ఎమ్మెల్యేల స్పష్టీకరణ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్17: రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కీలక తీర్పునిచ్చారు. ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. వారిపై అనర్హత వేటు వేసేందుకు తగిన ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. పార్టీ మారినట్లు సరైన ఆధారాలు చూపలేదని తీర్పు సందర్భంగా స్పీకర్ పేర్కొన్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఆధారాలు చూపలేకపోయారని స్పీకర్‌ప్రసాద్ కుమార్ అన్నారు. వారంతా సాంకేతికంగా బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు స్పష్టం చేస్తూ అరికెపూడి గాంధీ, మహిపాల్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్ అనర్హత పిటిషన్లను కొట్టేశారు.

ముగ్గురు ఎమ్మెల్యేలకు సంబంధించి గురువారం తీర్పు

మొత్తం పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు. ఇందులో ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి చేశారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణ ఇంకా పూర్తి కాలేదు. అనర్హత పిటిషన్లపై

...:: మిగతా 2లో



పంచాయతీ ఎన్నికల మూడో దశ పోలింగ్ చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. పలు చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఘర్షణలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా 80.78శాతం పోలింగ్ నమోదయినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. మూడో విడతలో భాగంగా బుధవారం రోజున 3,752 గ్రామ పంచాయతీలు, 28,410 వార్డుల్లో ఎన్నికలు జరిగాయి. సర్పంచ్ పదవి కోసం 12,652 మంది, వార్డు మెంబర్లుగా 75,725 మంది పోటీలో నిలిచారు.

'పంచాయతీ' సమాప్తం

మూడో విడత పోలింగ్‌ప్రశాంతం

- పలు చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఘర్షణలు
- రాష్ట్ర వ్యాప్తంగా 80.78శాతం పోలింగ్‌నమోదు
- మూడో విడతలోనూ కాంగ్రెస్ హవా
- కాంగ్రెస్ 2,246, బీఆర్ఎస్ 1,162, బీజేపీ 246, ఇతరులు 491 స్థానాలు కైవసం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్17: మూడో విడత పంచాయతీ ఎన్నికల ఫలితాల్లోనూ కాంగ్రెస్ హవా కొనసాగింది. మొత్తం 4,158 స్థానాలకు గాను 2,246 స్థానాలతో అధికార కాంగ్రెస్ దూసుకెళ్లోంది. బీఆర్ఎస్ మద్దతుదారులు 1,162 స్థానాల్లో గెలుపొందారు. అలాగే బీజేపీ 246 స్థానాలను కైవసం చేసుకుంది. ఇక ఇతరులు 491 స్థానాల్లో విజయం సాధించారు. మూడు విడుతల్లో మొత్తంగా కాంగ్రెస్ మద్దతుదారులు 6,822, బీఆర్ఎస్ 3,518, బీజేపీ 703, ఇతరులు 1,654 స్థానాలలో విజయం సాధించారు. పంచాయతీ ఎన్నికల మూడో దశ పోలింగ్ చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది.

బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఘర్షణ

ఖమ్మం జిల్లా టేకులపల్లి మండలం బద్దుతండాలో


...:: మిగతా 2లో



మన భాగస్వామ్యం పటిష్టం

ఇథియోపియాలోని ప్రజాస్వామ్య దేవాలయం నుంచి మాట్లాడడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. అత్యున్నత పురస్కారం 'గ్రేట్ ఆనర్ ఆఫ్ ఇథియోపియా నిషాన్'ను తనకు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

7



చిరు వ్యాపారులను పట్టించుకోవడం లేదు

తయారీ రంగంపై దృష్టి పెట్టాలంటూ కేంద్ర ప్రభుత్వానికి రాహుల్ గాంధీ సూచించారు. దేశంలో చిరు వ్యాపారులను పట్టించుకోవడం లేదంటూ కేంద్ర వైఖరిని తప్పుపట్టారు.

7





రైతుల సంక్షేమం కోసం బాటలు వేయాలి

- రైతు ఆధారిత పథకాలకు మేథో మథనం జరగాలి
- పసుపు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి
- ఆ బాధ్యత పసుపు బోర్డు తీసుకోవాలి
- వ్యవసాయ ఉత్పత్తులు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకం
- టర్మరిక్ వాల్యు చైన్ సమ్మిట్ -2025 లో మంత్రి తుమ్మల

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్17: దేశంలో పండే పసుపును ప్రపంచ మార్కెట్లలో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లేందుకు సమిష్టి చర్యలు అవసరమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌లో బుధవారం సీఐఐలో తెలంగాణ, జాతీయ పసుపు బోర్డు సంయుక్తంగా నిర్వహించిన టర్మరిక్ వాల్యు చైన్ సమ్మిట్ - 2025 లో పాల్గొన్న మంత్రి, పసుపు రైతుల సంక్షేమం, విలువ జోడింపు, ఎగుమతుల అవకాశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' లో అగ్రీ విజన్ 2047 ఆవిష్కరించిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ఈ విజన్‌లో వ్యవసాయాన్ని కేవలం సంక్షేమ రంగంగా కాకుండా, రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ప్రధాన ఇంజన్‌గా చూస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అగ్రి విజన్‌లో పసుపుకి కూడా పాత్ర ఉందని మంత్రి అన్నారు. పసుపు మనకు కొత్త పంట కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమై ఉందని మంత్రి అన్నారు. వంటింటికే పరిమితం కాకుండా, మెడిసిన్, న్యూట్రాస్యూటికల్స్, ఫంక్షనల్ ఫుడ్స్ వంటి రంగాల్లో పసుపు వినియోగం పెరుగుతోందని వివరించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా పసుపు సాగులో భారత్ అగ్రస్థానంలో ఉంది. పసుపు రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా

...:: మిగతా 2లో

శీతాకాల విడిది కోసం..

హైదరాబాద్‌కు రాష్ట్రపతి

- 22 వరకు బొల్లారం రాష్ట్రపతి నిలయంలో విడిది
- స్వాగతం పలికిన గవర్నర్, డిప్యూటీ సీఎం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 17: శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌చేరుకున్నారు. ఈ నెల 22 వరకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఉండనున్నారు. ప్రతి ఏడాది రాష్ట్రపతి హోదాలో ఉన్నవారు శీతాకాల విడిది కోసం హైదరాబాద్ రావడం తెలిసిందే. ఈ క్రమంలోనే బుధవారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాలం విడిది కోసం హైదరాబాద్‌కు విచ్చేశారు. శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు ఘనస్వాగతం పలికారు. బొల్లారంలోని రాష్ట్రపతి హాకీంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కతో పాటు అధికారులు ఘనస్వాగతం


...:: మిగతా 2లో



తొలి మిస్ ఇండియా కన్నుమూత

తొలి మిస్ ఇండియా, ప్రఖ్యాత ఫ్యాషన్ జర్నలిస్ట్ మెహర్ కాస్టలినో (81) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం తుదిశ్వాస విడిచారు.

7



...:: 2లో

రాష్ట్రంలో మూడవ డిస్కం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రెండు విద్యుత్ పంపిణీ సంస్థలకు అదనంగా మూడవ డిస్కం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.



2029 అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్

- కేసీఆర్‌పుట్టిన రోజున పార్టీ ప్రకటన?
- లక్ష్యం చేరేదాకా పోరాటం
- జాగృతి అధ్యక్షురాలు కవిత దూకుడు
- నేటి నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో యాత్ర

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 17: అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్‌గా, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో అంతర్గత రాజకీయాలకు గట్టి షాక్‌గా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దూకుడు పెంచారు. 'తగ్గేదేలేదు..అనుకున్న లక్ష్యం చేరేదాకా పోరాటం ఆపేది లేదు' అంటూ ఆమె చేసిన ప్రకటన ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలను కొత్త మలుపు వైపు నడిపిస్తోంది. ఇటీవల 'ఆస్క్ కవిత' పేరుతో నెటిజన్లతో నేరుగా మాట్లాడిన కవిత, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీగా అవతరించబోతున్నట్లు స్పష్టం చేయడంతో రాజకీయ వర్గాల్లో చర్చ ముమ్మరమైంది. ఇప్పటికే తెలంగాణ జాగృతి రాష్ట్ర కమిటీని ప్రకటించి, 'జనంబాట' యాత్రతో ప్రజల మధ్యకు వెళ్తున్న ఆమె క్షేత్రస్థాయి నుంచే పార్టీ నిర్మాణానికి పునాది వేస్తున్నట్లు సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2029 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా రాజకీయ యుద్ధానికి సిద్ధమంటూ ఆమె ఇచ్చిన సంకేతం జాగృతి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, ఇతర పార్టీల్లోనూ కలవరం రేపుతోంది.

ప్రజల సమస్యలే తన రాజకీయ అజెండా

ప్రజల సమస్యలే తన రాజకీయ అజెండా అని పదేపదే చెబుతున్న కవిత, జనంబాట యాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, సమస్యలు స్వీకరిస్తున్నారు. వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా, కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారాలు లభించడమే ఆమె యాత్రకు మరింత విశ్వసనీయత తీసుకొస్తోంది. ప్రజల మధ్యే ఉండి రాజకీయాలు చేయాలన్న ఆమె విధానం ఇప్పుడు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెడుతోంది. ఒకే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపైన, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వంపైన ఆమె చేస్తున్న విమర్శలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. అవినీతి తిమింగలాలపై పోరాటం ఆపేది లేదని, "నన్ను ఒకటి కొడితే..

...:: మిగతా 2లో



అణు రంగంలో ప్రైవేట్‌కు అనుమతి

అణు రంగంలో ప్రైవేట్ సంస్థల ప్రవేశానికి ముందడుగుపడింది. దీనికి అనుమతించే 'శాంతి' బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది.

7

రాష్ట్రీయం

సీఎం రేవంత్ దావోస్ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 17: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 19 నుంచి 23 వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సుకు హాజరు కానున్నారు. ఈ విదేశీ పర్యటనకు ఏసీబీ స్పెషల్ కోర్టు అనుమతి ఇచ్చింది. 2015లో జరిగిన ఓటుకు నోటు (క్యాష్ ఫర్ వోట్) కేసులో బెయిల్ షరతుల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి పాస్‌పోర్టు కోర్టు కస్టడీలో ఉంది. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలకు ప్రతిసారీ కోర్టు అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో రూ.10 వేల పూచికత్తుతో పాస్‌పోర్టు ఇచ్చేందుకు కోర్టు అనుమతించింది. అయితే మార్చి 3లోగా పాస్‌పోర్టు తిరిగి అప్పగించాలని కోర్టు ఆదేశించింది. దావోస్ సదస్సులో తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించేందుకు సీఎం రేవంత్ ప్రతినిధి బృందంతో కలిసి పాల్గొననున్నారు. గతేడాది కూడా ఆయన దావోస్‌కు వెళ్లి పెట్టుబడులపై ఒప్పందాలు కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఈ అనుమతితో సీఎం విదేశీ పర్యటనకు అడ్డంకులు తొలగాయి.

శీతాకాల విడిది కోసం..


హైదరాబాద్‌కు రాష్ట్రపతి

మొదటిపేజీ తరువాయి

పలికారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో డిసెంబర్ 17 నుంచి 22 వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. హకీంపేట, అల్వాల్, బొలారం, తిరుమలగిరి, కార్ఖానా ప్రాంతాల్లో వాహనాల డైవర్షన్ కొనసాగుతుంది. రాష్ట్రపతి పర్యటన ముగిసే వరకు డ్రోన్లు, పారా గ్లైడర్స్, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్స్ ఎగురవేతపై నిషేధం విధించారు. 18న సికింద్రాబాద్ లోని రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి విశ్రాంతి తీసుకుంటారు. 19న రామోజీ ఫిలిమ్ సిటీలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు హాజరవుతారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పాల్గొంటారు. 21న రాష్ట్రపతి నిలయంలో ప్రముఖల కోసం 'ఎట్ హోమ్', పౌరుల భేటీ లో పాల్గొంటారు. 22న సాయంత్రం తిరిగి ఢిల్లీకి బయలుదేరుతారు.

రాష్ట్రంలో మూడవ డిస్కం

- ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్17 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రెండు విద్యుత్ పంపిణీ సంస్థలకు అదనంగా మూడవ డిస్కం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రెండు డిస్కంల పరిధి చాలా ఎక్కువగా ఉండటం, విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం, పేదల గృహాలకు 200 యూనిట్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాల నిర్వహణతో డిస్కంలపై పెరిగిన ఆర్థిక భారంతో పాటు ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని సంస్కరించడం మూడో డిస్కం ముఖ్య ఉద్దేశం అని తెలుస్తుంది. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న సదరన్, నార్తర్న్ డిస్కమ్స్ తో పాటు ఈ కొత్త డిస్కం పనిచేయనుంది. ఈ నిర్ణయం వల్ల విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్థిక ఇబ్బంది తగ్గడంతో పాటు పలు సంక్షేమ పథకాల అమలుకు మెరుగుపర్చడం జరుగుతుందనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది.





పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన

జాగృతి నాయకులకు కవిత సన్మానం


ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 17: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌లుగా గెలుపొందిన తెలంగాణ జాగృతి నాయకులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సన్మానించారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు జాగృతి నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించిన కవిత, గెలుపుపై అభినందనలు తెలియజేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఆమె సూచించారు.

షాహీ ఎక్స్‌పోర్ట్స్ కార్మికుల ధర్నాకు కవిత మద్దతు

నాచారం షాహీ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో ధర్నా చేస్తున్న కార్మికులకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమెను కలిసిన కార్మికులతో కవిత మాట్లాడారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, మహిళా కార్మికుల పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. 15 రోజులుగా 2500 మంది మహిళలు రోడ్లపై ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. లేబర్ కమిషనర్, లేబర్ మంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు 9 ఏళ్లుగా జీతాల్లో మార్పు లేకపోయినా ధరలు విపరీతంగా పెరిగాయని, లేబర్ చట్టాలు అమలు కావడం లేదని విమర్శించారు. రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే జాగృతి తరపున మహిళలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇతర కార్మిక సంఘాలను కూడా కలుపుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.

'రాజు వెడ్స్ రాంబాయి' మూవీ టీమ్‌కు కవిత శుభాకాంక్షలు

విజయవంతంగా ప్రదర్శితమవుతున్న రాజు వెడ్స్ రాంబాయి సినిమా టీమ్‌కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సినిమా నిర్మాత వేణు ఉడుగుల, దర్శకుడు సాయిలు కంపాటి, ప్రైజెంటర్ పూజారి నాగేశ్వర్ రావు, లిరిక్ రైటర్ మిట్టపల్లి సురేందర్, మ్యూజిక్ డైరెక్టర్ సురేశ్ బొబ్బిలి, నటుడు ఆదిత్య, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మురళీ పున్న తదితరులు కవితను కలిశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, సినిమా మంచి విజయం సాధించిందని, మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.



రాష్ట్రంలో డ్వాక్రా గ్రూపుల ద్వారా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలి. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులు వస్తాయి. ఈ ప్రాజెక్టులకు భూసేకరణ కీలకం. ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు వెళ్లాలి. యువతలో నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగాల కల్పన ఎలా చేయగలం అనే అంశంపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి.

- అధికారులతో సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు

'పంచాయతీ' సమాప్తం

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఓ వ్యక్తి తొలుత గుర్తింపు కార్డ్ లేకుండా పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. ఓటు వేసేందుకు అధికారులు నిరాకరించడంతో వెనుదిరిగాడు. ఆ తరువాత గుర్తింపు కార్డుతో మరోసారి అక్కడికి వచ్చాడు. ఈ క్రమంలో గమనించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భూక్యా గంగారావు సదరు వ్యక్తి దొంగ ఓటు వేస్తున్నాడని ఆరోపించాడు. ఆగ్రహానికి గురై అతడిపై చేయిచేసుకున్నాడు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. నల్గొండ జిల్లా డిండి మండలం శాంతిగూడెంలోనూ రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు పరస్పరం దాడి చేసుకున్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్‌లో సర్పంచ్ అభ్యర్థి వద్ద పోలీసులు రూ.28,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. వికారాబాద్ జిల్లాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పరిగి మండలం మాదారంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి రాములుపై కాంగ్రెస్ మద్దతుదారులు దాడికి పాల్పడ్డారు. గాయపడిన రాములును పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఆసుపత్రిలో రాములును మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పరామర్శించారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దర్శించర్ల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు పోలింగ్ బూత్ వద్ద ప్రచారం నిర్వహిస్తున్నారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం మెటల్‌కుంట పోలింగ్ కేంద్రం వద్ద కూడా ఉద్రిక్తత నెలకొంది. పోలింగ్ సమయం ముగిసిన ఓటు వేసేందుకు వెళుతున్న బీఆర్ఎస్ వర్గీయులను కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఓటు వేసేందుకు ఎలా అనుమతించారంటూ పోలింగ్ కేంద్రం ప్రహరీ దూకి లోపలికి వెళ్లేందుకు బీఆర్ఎస్ మద్దతుదారులు యత్నించడంతో తీవ్ర ఆందోళన నెలకొంది.

జగన్ పై చంద్రబాబు గెలుపు

అయితే తెలంగాణ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో ఆశ్చర్యకరమైన ఘటన జరిగింది. భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం గుండ్లరేవు గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి జగన్ పై కాంగ్రెస్ అభ్యర్థి చంద్రబాబు విజయం సాధించారు. రాజకీయాల్లోని ప్రముఖ నాయకుల పేర్లతో ఉన్న అభ్యర్థులు సర్పంచ్ బరిలో నిలవడంతో చాలా మందికి ఫలితంపై ఆసక్తి ఏర్పడింది. ఈ క్రమంలో తాజాగా వెల్లడైన ఫలితాల్లో బానోతు జగన్ పై భూక్యా చంద్రబాబు విజయం సాధించారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన సీఎస్, డీజీపీ

మూడవ విడత పోలింగ్ సరళిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డిలు రాష్ట్ర ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినితో పాటు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వెబ్ కాస్టింగ్ టెక్నాలజీని మరింత విరివిగా ఉపయోగించి ఎన్నికలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మొదటి, రెండు దశలలో జరిగిన పోలింగ్‌తో పోలిస్తే మూడవ దశలో పోలింగ్ శాతం పెరిగే అవకాముందని ఆయన తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్లను, అధికారులను, పోలింగ్‌సిబ్బందిని సిఎస్ అభినందించారు. పంచాయతీరాజ్ ఎన్నికలకు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ విస్తృత బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీజన, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మందా మకరందం తదితరులు పాల్గొన్నారు.

22న సర్పంచులు, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకరణ

- 20న ముహూర్తాలు లేవని మార్పు

పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకరణ వాయిదా పడింది. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు ఈ నెల 20న బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. అయితే, ముహూర్తాలు లేవన్న కారణంగా 22కు వాయిదా వేయాలని ప్రజా ప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. వారి విజ్ఞప్తులపై పంచాయతీరాజ్ శాఖ సానుకూలంగా స్పందించింది. సర్పంచులు, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకరణ తేదీని 20 నుంచి 22వ తేదీకి మార్పు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే రోజున నూతన సర్పంచులు, వార్డు సభ్యులు పదవి బాధ్యతలు స్వీకరించనున్నారు.

తెలంగాణలో దిగ్విజయంగా క్రీడా కార్యక్రమాలు

- స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డాక్టర్ సోనీ బాలాదేవి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్17 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సహకారంతో హైదరాబాద్ నగరంలో, తెలంగాణలో వివిధ క్రీడా కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించగలుగుతున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి అన్నారు. బుధవారం బేగంపేట పబ్లిక్ స్కూల్ లో జరుగుతున్న 45వ సీనియర్ జాతీయ ఆర్చరీ పోటీల్లో రికర్వ్ విభాగానికి చెందిన పోటీలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ క్రీడా శాఖ ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్న అనేక క్రీడా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, హైదరాబాద్ నగరం స్పోర్ట్స్ హబ్ గా మారేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడుతున్నాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కిషోర్ గోపీనాథ్, తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు టి రాజు ప్రధాన కార్యదర్శి అరవింద్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పుట్టా శంకరయ్య, ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు చేతన్ కవ్లేకర్, డాక్టర్ ధుర్రం, ఈ సంజీవరెడ్డి, సి హెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.



రైతుల సంక్షేమం కోసం బాటలు వేయాలి

మొదటిపేజీ తరువాయి

చొరవ తీసుకోవాలి. పసుపును అధికంగా పండించే రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఒకటి. నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంతాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఆర్మూర్ పసుపుకు జీఐ ట్యాగ్ రావడం తెలంగాణ రైతులకు గర్వకారణం అని అన్నారు. నిజామాబాద్ రైతుల చిరకాల ఆకాంక్ష అయిన నేషనల్ టర్మరిక్ బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, అది పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బోర్డు కార్యాలయ పరిమితుల్లో కాకుండా, రైతులకు పాలసీ దిశ చూపే సంస్థగా పనిచేయాలని, పరిశోధనను రైతు పొలాలకు తీసుకెళ్లాలని, మార్కెటింగ్, బ్రాండింగ్, ఎగుమతుల్లో నాయకత్వం వహించాలని కోరారు. తెలంగాణలో అనుకూల వాతావరణం, శ్రమించే రైతులు ఉన్నప్పటికీ ధరల హెచ్చు, తగ్గుల కారణంగా పసుపు సాగు విస్తీర్ణం తగ్గడంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. నేషనల్ టర్మరిక్ బోర్డు విజన్ 2047 కు అనుగుణంగా పనిచేసి, ధరల స్థిరత్వం, ముందస్తు మార్కెట్ సంకేతాలు రైతులకు అందించాలన్నారు. ప్రామాణిక మాయిశ్చర్ మీటర్లు, ఒకే రకమైన తేమ ప్రమాణాలు, పారదర్శక మార్కెట్ వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. రైతులు ముడి పసుపును మాత్రమే అమ్మకుండా, విలువ జోడింపుపై దృష్టి పెట్టాలని మంత్రి పిలుపునిచ్చారు. పసుపు భవిష్యత్ ముడి పంటలో కాదు, విలువ ఆధారిత ఉత్పత్తుల్లోనే ఉందని స్పష్టం చేశారు. పసుపు ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, న్యూట్రాస్యూటికల్స్, ఇమ్యూనిటీ ఉత్పత్తులు, కాస్మోటిక్స్, కర్క్యూమిన్ ఎక్స్‌ట్రాక్షన్ వంటి ఉత్పత్తుల తయారీకి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. దీంతో డిమాండ్ పెరిగి, రైతుల ఆదాయం పెరుగుతుందని, అప్పుడే తెలంగాణ రాష్ట్రం పెట్టుకున్న విజన్ 2047 లోని అగ్రి విజన్ లక్ష్యాలకు చేరువ అవుతామని మంత్రి అన్నారు. ఈ సమావేశంలో టర్మరిక్ బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్రమోహన్, టర్మరిక్ బోర్డు సెక్రటరీ భవానీ శ్రీ, సిఐఐ తెలంగాణ చైర్మన్ శివ ప్రసాద్ రెడ్డి, అగ్రి యూనివర్సిటీ మాజీ విసి ప్రవీణ్ రావు, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గంగాధర్, సింథైట్ ఇండస్ట్రీస్ స్ట్రాటజిక్ సోర్సింగ్ హెడ్ జయశంకర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

2029 అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్

మొదటిపేజీ తరువాయి

నేను రెండు కొడుతాను" అంటూ కవిత చేస్తున్న వ్యాఖ్యలు ఆమె రాజకీయ దూకుడును స్పష్టంగా చూపిస్తున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నలు వేస్తూనే, ప్రతిపక్షం పాత్రపై కూడా నేరుగా వేలెత్తి చూపడం ఆమె వ్యూహంలో కీలకంగా మారింది.

బీఆర్ఎస్‌లో కలకలం

ఇక బీఆర్ఎస్ అంతర్గత రాజకీయాలపై కవిత చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం సృష్టిస్తున్నాయి. తండ్రి కేసీఆర్‌ను కూడా లెక్కచేయకుండా, కొందరు కీలక నేతలను టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనంగా మారాయి. హరీశ్ రావు, సంతోష్‌లపై ఆమె చేసిన తీవ్ర వ్యాఖ్యలు బీఆర్ఎస్ శ్రేణుల్లో చర్చకు దారితీయడమే కాకుండా, పార్టీ లోపలి విభేదాలను బహిర్గతం చేశాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. "గుంట నక్కల వల్లే పార్టీకి చీడ పట్టింది" అంటూ ఆమె చేసిన ఆరోపణలు రాజకీయ వేడిని మరింత పెంచాయి.

కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ ప్రకటన

హైదరాబాద్ నగరంలోని అన్ని ప్రాంతాల్లో జనంబాట యాత్రను పూర్తి చేసిన కవిత, నేటి నుంచి భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో యాత్ర కొనసాగిస్తున్నారు. ఈ యాత్ర వచ్చే ఏడాది ఫిబ్రవరి 16 వరకు సాగనుంది. అత్యంత కీలకంగా, ఫిబ్రవరిలో జరిగే జనంబాట చివరి షెడ్యూల్‌లో, కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ పేరు, జెండా, అజెండాను ప్రకటించే అవకాశం ఉందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. దసరాకే కొత్త పార్టీ ప్రకటన ఉండాల్సి ఉన్నప్పటికీ, అప్పట్లో తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించి ఆ ప్రకటనను వాయిదా వేసిన విషయం తెలిసిందే. అయితే అంతర్గతంగా పార్టీకి సంబంధించిన అన్ని కసరత్తులు ఇప్పటికే పూర్తయ్యాయని జనంబాట యాత్రలో చోటుచేసుకుంటున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తంగా చూస్తే, కల్వకుంట్ల కవిత రాజకీయ ప్రయాణం ఇప్పుడు అత్యంత కీలక దశలోకి ప్రవేశించింది. ప్రభుత్వం మీద పోరాటం, ప్రతిపక్ష బీఆర్ఎస్‌తో అంతర్గత కుస్తీ... రెండింటినీ సమాంతరంగా నడుపుతూ, ప్రజల సమస్యలనే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్నారు. పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్న తరుణంలో, కవిత రాజకీయ వ్యూహం రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఏ స్థాయిలో మార్చబోతోందన్నదే ఇప్పుడు అందరి దృష్టి.

వారు పార్టీ మారినట్లు ఆధారాలు లేవు

మొదటిపేజీ తరువాయి

స్పీకర్ త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై ఈ నెల 19న మరోమారు విచారణ జరగనుంది. 8 మందికి సంబంధించి విచారణ పూర్తి చేసిన గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం ఐదుగురికి సంబంధించి తీర్పు ఇచ్చారు. కాలే యాదయ్య, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్‌కు సంబంధించి గురువారం తీర్పు ఇవ్వనున్నారు.

అభివృద్ధి పనుల కోసమే..

ఎనిమిది మంది ఎమ్మెల్యేలను ఇప్పటికే క్రాస్ఎగ్జామినేషన్ పూర్తయింది. ఆ ఎమ్మెల్యేలపై నిర్ణయం రిజర్వ్ చేసిన స్పీకర్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిల విషయంలో రెండు సార్లు నోటీసులు ఇచ్చినా వివరణ ఇవ్వకుండా మరింత సమయం కావాలని కోరారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని తమ వాదనల్లో స్పష్టం చేశారు. ఇప్పటికీ తాము సాంకేతికంగా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని వెల్లడించిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో అధికారికంగా చేరలేదని స్పీకర్‌కు వివరణ ఇచ్చారు. తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల కోసమే ముఖ్యమంత్రితో సమావేశమైనట్లు తెలిపారు.

అసలేం జరిగింది?

పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు పది మందిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నాయకులు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై స్పీకర్ సకాలంలో స్పందించి చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలపై విచారణ చేపట్టాలని హైకోర్టు స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు సూచించింది. ఈ ఉత్తర్వులతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ నాయకులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

రెండు నెలల సమయం కావాలన్న స్పీకర్ కార్యాలయం

విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ ఏడాది జులై 31వ తదీన ఆ పది మంది ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదులను మూడు నెలల్లో తేల్చాలని స్పీకర్‌ను ఆదేశించింది. దీంతో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ వేగవంతం చేశారు. నిర్దేశించిన మూడు నెలల గడువు లోపు విచారణ పూర్తి చేయకపోవడంపై నవంబర్‌లో సుప్రీంకోర్టు మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కారంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్న సుప్రీంకోర్టు, త్వరగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. లేదంటే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా స్పీకర్‌ను హెచ్చరించింది. నోటీసులు అందుకుని స్పందించిన 8 మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసేందుకు మరో రెండు నెలలు సమయం కావాలని స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంలోనే సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

రాష్ట్రీయం

స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చ

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు
- యాంటీ-డిఫెక్షన్ చట్టాన్ని కాలరాసిన కాంగ్రెస్ ప్రభుత్వం: మాజీ ఎంపీ వినోద్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 17: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన తాజా తీర్పు ప్రజాస్వామ్య సూత్రాలను తీవ్రంగా దెబ్బతీసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. "సేవ్ ది కానిస్టిట్యూషన్" అంటూ దేశమంతా ప్రచారం చేసే కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో మాత్రం రాజ్యాంగాన్ని నిర్లజ్జగా ఉల్లంఘించిందని ఆరోపించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం అమలులో ఉన్న యాంటీడిఫెక్షన్ చట్టాన్ని పూర్తిగా పక్కన పెట్టి, అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఇది రాజ్యాంగాన్ని కాలరాయడమేనని హరీశ్ రావు అన్నారు. ఈ ఘటన ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చగా నిలుస్తుందన్నారు. ఇదే విషయంపై అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ. వివేకానంద, సంజయ్ మాట్లాడుతూ స్పీకర్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో మాత్రమే స్పీకర్‌కు చట్టబద్ధత ఉంటుందని, కానీ ఈ తీర్పుతో ప్రజలు నవ్వుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ మద్దతుదారుల స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలు బహిరంగంగా పాల్గొన్న విషయాన్ని గుర్తుచేశారు. అయినప్పటికీ, పార్టీ మారలేదని స్పీకర్ చెప్పడం ఆశ్చర్యకరమని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఈ వ్యవహారంపై ఊరుకునే ప్రసక్తేలేదని, హైకోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు స్పష్టమైన సూచనలు ఇచ్చినా, కేవలం ఐదుగురు ఎమ్మెల్యేలపై మాత్రమే తీర్పు ఇవ్వడం వెనుక ఉద్దేశాలపై అనుమానాలు వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లకు నోటీసులు ఇచ్చినా స్పందించలేదని, వారిని అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తీర్పు కాపీ ఇవ్వకుండా ఆలస్యం చేయడం కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నంగా పేర్కొన్నారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ, స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టువంటిదని అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలే అభివృద్ధి కోసమే పార్టీ మారినట్లు బహిరంగంగా చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అయినా పార్టీ మారలేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన యాంటీడిఫెక్షన్ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీనే నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. పార్టీ పిరాయింపులపై పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని, 10వ షెడ్యూల్‌కు సవరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. చివరగా సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని బీఆర్ఎస్ నేతలు సవాల్ విసిరారు.



గ్రామాల్లో మెరుగైన పాలన అందించాలి

- పంచాయతీ విజేతలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచన

ప్రతిపక్షం, కూసుమంచి, డిసెంబర్17: తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలిచిన ప్రజా ప్రతినిధులను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన పాలన. అందించడమే ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు శాలువ కప్పి, స్వీట్లు తినిపించి మంత్రి అభినందనలు తెలిపారు. అలాగే ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులను కూడా అభినందిస్తూ... గ్రామాల అభివృద్ధికి సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పారదర్శకంగా, బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులను కూడా కలిసి ఆయన మాట్లాడారు. అధైర్యపడొద్దని, పార్టీ కోసం, ప్రజల కోసం పనిచేస్తూనే ఉండాలని హితవు పలికారు. అందరూ కలిసికట్టుగా ముందుకు సాగితే కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధైర్యం చెప్పారు.



ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం

- తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్
- కవితపై వ్యాఖ్యలు ఖండనీయం
- జాగృతి అధికార ప్రతినిధులు శ్రీకాంత్ గౌడ్, మనోజా గౌడ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 17: గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చితే పేదల జీవితాలు మారవని తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ అన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉండగా, కేంద్ర ప్రభుత్వం దాన్ని బలహీనపరుస్తోందని విమర్శించారు. వంద రోజుల పనిని 125 రోజులు చేస్తామని చెప్పడం సంతోషకరమేనని, కానీ ప్రస్తుతం ఉన్న వంద రోజుల పని కూడా పూర్తిగా అమలు కావడం లేదని అన్నారు. ఇప్పటివరకు ఈ పథకానికి కేంద్రం 90 శాతం నిధులు ఇవ్వగా, రాష్ట్రం 10 శాతం భరించేదని తెలిపారు. ఇప్పుడు కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం భరించాలనడం వల్ల చాలా రాష్ట్రాలు అమలు చేయలేని పరిస్థితి వస్తుందన్నారు. ఇది పేదలకు ఉపయోగం లేకుండా చేసే ప్రయత్నమని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ రవీందర్ రావు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండనీయమని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధులు నలమాస శ్రీకాంత్ గౌడ్, మనోజా గౌడ్ అన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, కవితపై వ్యక్తిగత దూషణలకు పాల్పడటం రాజకీయ సంస్కృతికి విరుద్ధమన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేసిన చరిత్ర ఉన్న వ్యక్తి ఈరోజు కవితపై మాట్లాడటం విడ్డూరమని వ్యాఖ్యానించారు. పార్టీకి ద్రోహం చేసిన వ్యక్తికి కవితపై మాట్లాడే అర్హత లేదన్నారు. రవీందర్ రావు పై భూ కబ్జాలు, ఆస్తుల విషయంలో అనేక ఆరోపణలు ప్రజల్లో చర్చకు వస్తున్నాయని తెలిపారు. కవిత ఎప్పుడూ రవీందర్ రావును పట్టించుకోలేదని, కావాలనే ఆమె పేరును రాజకీయంగా వాడుకుంటున్నారని విమర్శించారు. మనోజా గౌడ్ మాట్లాడుతూ, మహిళా నాయకురాలిపై మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని హితవు పలికారు. కవితపై అసభ్య వ్యాఖ్యలు చేయడం మహిళలందరినీ అవమానించడమేనన్నారు. రవీందర్ రావుపై ఉన్న ఆరోపణలను ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకొస్తామని తెలిపారు. ఫిబ్రవరి 2న 'జనం బాట' కార్యక్రమంలో భాగంగా మనుకోటకు వెళ్లి ప్రజలకు వాస్తవాలు వివరిస్తామని చెప్పారు.



ప్రజాపాలనకు పట్టం

- మూడో విడతలోనూ కాంగ్రెస్‌జోరు
- టీపీసీసీ చీఫ్‌మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్17: పల్లెల్లోని ప్రజలు మరోసారి కాంగ్రెస్ ప్రజాపాలనకు పట్టం కట్టారని, ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని టీపీసీసీ చీఫ్‌మహేశ్ కుమార్ గౌడ్‌పేర్కొన్నారు. బుధవారం జరిగిన మూడో విడత సర్పంచ్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులే ఘన విజయం సాధించడం గ్రామీణ ఓటర్లు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై వ్యక్తం చేసిన విశ్వాసానికి స్పష్టమైన ప్రతిబింబం అని ఆయన తెలిపారు. పంచాయతీ ఎన్నికల మూడో విడత ఫలితాలు ప్రతిపక్షాలకు చెంపపెట్టులా మారాయని ధ్వజమెత్తారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను ఒకే వేదికపై సమన్వయం చేస్తూ గ్రామస్థాయి వరకు విస్తరించిన ప్రచారం పార్టీకి అనుకూలంగా మారిందని తెలిపారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టే విధంగా వచ్చిన ఈ తీర్పు ఉందన్నారు.



గడువులోగా భవన నిర్మాణం పూర్తి కావాలి

- హైకోర్టు భవన నిర్మాణ పనులను పరిశీలించిన స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 17: రాష్ట్ర ప్రభుత్వం రాజేంద్రనగర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవన నిర్మాణ పనులను రోడ్లు, భవనాల శాఖస్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్లు రాజేశ్వర్ రెడ్డి, లింగారెడ్డి క్షేత్రస్థాయి ఇంజనీర్లు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు మరియు కన్సల్టెంట్లు పాల్గొన్నారు. పనుల పురోగతిని సమీక్షించిన అనంతరం, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంబంధిత అధికారులకు, సంస్థలకు కీలక ఆదేశాలను జారీ చేశారు. సుమారు రూ. 2,583.00 కోట్లు వ్యయంతో 36.52 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న హైకోర్టు భవనం రాష్ట్ర ఐకానిక్ బిల్డింగ్ లా ఉండాలని, అధికారులు అందుకు తగ్గట్టుగా మనసుపెట్టి పనిచేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థను ఆదేశించారు. పనుల పురోగతిపై శాఖా పరమైన అధికారులు కన్సల్టెంట్ మరియు కాంట్రాక్టర్‌తో తరచుగా సమీక్షా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అలాగే, జోన్ 2కి సంబంధించిన అటవీ శాఖ అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ చీఫ్ ఇంజనీర్‌కు సూచించారు.



బాకారం గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తా

- 1వ వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి
- 148 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపు.

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 17 : మండలంలోని బాకారం గ్రామ పంచాయతీ ఎన్నికలలో 1 వ వార్డు సభ్యులుగా కొంతం నాగేశ్వర్ రెడ్డి భారీ విజయం సాధించారు. బుధవారం నాగేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... 148 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించిన, గ్రామపంచాయతీ ఎన్నికలలో నాపై ఉన్న నమ్మకంతో నన్ను వార్డు సభ్యునిగా గెలిపించిన గ్రామస్తులకు నాకు సహకరించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకంతో విజయం చేకూర్చిన గ్రామస్తులకు రుణపడి ఉంటామన్నారు. బాకారం గ్రామాన్ని సర్పంచ్ తో కలిపి తిరుగులేని అభివృద్ధి చేస్తానని కొంతం నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. భారీ మెజార్టీ అందించిన గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం ఓట్లు వేసిన ప్రజలందరినీ అని హర్షం వ్యక్తం చేశారు.



బీఆర్ఎస్‌కు బాయ్.. కాంగ్రెస్‌కు జై!

- కాంగ్రెస్ గూటికి లక్ష్మీదేవి పల్లి సర్పంచ్, వార్డు సభ్యులు
- గ్రామాభివృద్ధి కోసమేనని వెల్లడి..
- సర్పంచులకు సహకరిస్తా: ఎమ్మెల్యే వీర్లపల్లి

ప్రతిపక్షం, షాద్‌నగర్, డిసెంబర్17: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తా.. తనను నమ్మిన సర్పంచులకు నిరంతరం అండగా ఉంటా.. అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు మండలం లక్ష్మీదేవి పల్లి సర్పంచ్ మంచాల అనూష దామోదర్, ఉపసర్పంచ్ వెంకటేష్‌గౌడ్ లతోపాటు 8 మంది వార్డు సభ్యులను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన పార్టీలో చేర్చుకున్నారు. దీనిపై సర్పంచ్, వార్డు సభ్యులు స్పందిస్తూ గ్రామాభివృద్ధి కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. దీనిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందడం అధికార పార్టీ చేతుల్లోనే ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందని వివరించారు. ఇప్పటికే పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం గ్రామాలకు విస్తరింప చేసిందని గుర్తు చేశారు. లక్ష్మీదేవి పల్లి అభివృద్ధికి అంకితభావంతో ప్రయత్నిస్తానని వారికి హామీ ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పి.సునీత, కే. స్వప్న, పి శివకుమార్, పి బాలరాజ్, అనూష, శంకర్, వెంకటయ్య పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. గ్రామ పెద్దలు సత్యం, మాజీ సర్పంచ్ నర్సింలు, మాజీ డిప్యూటీ సర్పంచ్ రాజేష్, ఊశయ్య, శ్రీనివాస్ గౌడ్, యాదయ్య గౌడ్,, రవీందర్, నర్సింలు, మల్లయ్య, కృష్ణయ్య, శ్రీనివాస్, శ్రీశైలం, పెంటయ్య, నరసింహులు, వెంకటయ్య, వినోద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో పురుగుల అన్నం

- నాణ్యతలేని భోజనంతో ప్రమాదంలో విద్యార్థుల ఆరోగ్యం



ప్రతిపక్షం, షాద్‌నగర్, డిసెంబర్ 17: షాద్ నగర్‌లోని గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో బుధవారం రాత్రి డిన్నర్ సమయంలో విద్యార్థులకు అందించిన అన్నంలో పురుగులు కనిపించడంతో తీవ్ర భయాందోళన నెలకొంది. భోజనం చేస్తున్న సమయంలోనే ఈ విషయం గమనించిన విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ కు , విద్యార్థి సంఘాలకు సమాచారం అందించారు. ఈ ఘటనపై స్పందించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గిరిజన కళాశాలలు, వసతి గృహాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషపూరితమైన, నాణ్యతలేని భోజనాలతో గిరిజన విద్యార్థుల జీవితాలను అనారోగ్యాల బాట పట్టిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని అధికార యంత్రాంగం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, ఆచరణలో మాత్రం అవి ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. ఇలాంటి నిర్లక్ష్య ధోరణి కొనసాగితే విద్యార్థుల భద్రతపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ఈ ఘటనపై వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పది కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం కాబ్జా

- అనుభవం లేని డిప్యూటీ తహసిల్దార్ ఎమ్మార్వో ఎలా అయింది..?
- ఎండోమెంట్ స్పెషల్ అధికారి మేడ్చల్ జిల్లా కాలక్టర్ కు తుంకుంట డూప్యూటీ కమిషనర్ లేఖ.
- తుంకుంట డూప్యూటీ కమిషనర్ సాక్షిగా శామీర్ పేట్ ఎమ్మార్వో మేడ్చల్ జిల్లా కలెక్టర్ వరకు తెలిసి బహిరంగంగా జరుగుతున్న కబ్జా...
- ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంతో దేవరాయంజాల్ భూములు కాబ్జా...



ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, డిసంబర్17: సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ జోక్యం ఉన్నట్టా లేనట్టా తుంకుంట సర్కిల్ పరిధిలోని దేవరాయంజాల్ గ్రామంలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నయంటూ గత మున్సిపల్ కమిషనర్, నేడు అదే తూముకుంట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి స్థానిక శామీర్ పేట్ తహసిల్దార్ కు అలాగే మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరికు ఎల్ఆర్ నెంబర్ MCT /122/2025. తేదీ 22 01 2025 నాడు ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్నట్లు లేక ద్వారా తెలియచేశారు. అలా నాటి నుండి నేటి వరకు యధేచ్చగా ప్రభుత్వ స్థలంలో భారీ అక్రమ షెడ్డు నిర్మాణం పూర్తి కానుంది. ఇలా సుమారు రెండు మూడు ఎకరాల ప్రభుత్వ స్థలాలలో నిర్మాణం సాగుతుందంటే అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో కళ్ళ ముందే తెలుస్తుంది. రేవంత్ సర్కార్ లో కరప్షన్ లేని అధికారులు ఉన్నారని నిరూపించుకోవడం చాలా కష్టమని, ఎందుకంటే సాక్షాత్తు కళ్ళ ముందు వేల కోట్ల విలువ వేసే ప్రభుత్వ స్థలాలు ఎలాంటి నాల కన్వెన్షన్, అనుమతులు లేకుండా పైగా ప్రభుత్వ స్థలాన్ని దర్జాగా కబ్జా చేస్తుంటే ఈ ప్రభుత్వంలో పనిచేసే అధికారులు ఏ విధంగా పరిపాలిస్తున్నారనేది ఈ కబ్జా వ్యవహారం చూస్తేనే తెలుస్తుంది. కళ్ళ ముందు కోట్లు విలువ వేసే ప్రభుత్వ స్థలం కబ్జాపై సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ ఎందుకు స్పందించడం లేదని తుంకుంట పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన కూడా అటువైపు ఎందుకు వెళ్లట్లేదని ప్రజలు బహిరంగ ఆరోపిస్తున్నారు. ఇక ఇదే అంశంపై అధికారులు స్పందించకపోతే ప్రతిపక్ష నేతలంతా కూడా ఏకమై మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముట్టడించి కాంగ్రెస్ నాయకుల అరాచకాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియజేయాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ కగార్‌యుద్ధానికి కాంగ్రెస్ మద్దతు ఇవ్వొద్దు

- తెలంగాణలో ప్రజాస్వామిక వాతావరణానికి ఎదురుదెబ్బ
- ఆర్ఎస్ఎస్, బీజేపీలకు వ్యతిరేకంగా పోరాడాలి
- 16 మంది అరెస్టులపై మావోల సంచలన ప్రకటన



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 17: ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్‌లో 16 మంది మావోయిస్టుల అరెస్ట్‌పై మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేశారు. టీజీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో లేఖవిడుదల అయ్యింది. కకర్ బుడ్డి, బాబ్జీ పేట్ గ్రామాల పరిసరాల్లో నిరాయుధంగా ఉన్న మావోయిస్టుల అరెస్ట్‌ను తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. తెలంగాణలో కొనసాగుతున్న ప్రజాస్వామిక వాతావరణానికి, ప్రజల అభిష్టానికి ఈ అరెస్టులు ఎదురుదెబ్బ అని వ్యాఖ్యానించింది. ఫాసిస్టు బీజేపీ రూపొందించిన కగార్ యుద్ధానికి మద్దతు ఇవ్వొదని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాసింది. ఇతర ప్రతిపక్ష పార్టీలు, సంఘాలు తెలంగాణలో ఇటువంటి సంఘటనలు జరగకుండా ముందు నుంచి కొనసాగుతున్న ప్రశాంత వాతావరణాన్ని కొనసాగేందుకు వీలుగా ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చింది. తెలంగాణలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు వీలుగా ఉద్యమించాలని పిలుపునిస్తున్నామని లేఖలో పేర్కొంది. మావోయిస్టు ముక్త (దేశంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీలను, భావజాలాలను లేకుండా చేయడం), ప్రతిపక్ష ముక్త లక్ష్యంతో కగార్ యుద్ధాన్ని అమలు చేస్తోందని లేఖలో విమర్శించింది.

అన్ని పార్టీలను నిర్వీర్యం చేయాలన్నదే బీజేపీ వ్యూహం...

ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్, ఏక్ చునావ్, ఏక్ పార్టీ నినాదాలతో దేశంలోని అన్ని పార్టీలను నిర్వీర్యం, నిర్మూలన చేసే పథకం ప్రకారం ముందుకు పోతుందని విమర్శించింది. ఎలక్షన్ కమిషన్, కోర్టులు, సీబీఐ, ఎన్ఐఏ, ఇతర రాజ్యాంగ సంస్థలను, వ్యవస్థలను తన కంట్రోల్‌లో పెట్టుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పాతర వేసిందని.. దానికి బీహార్ ఎన్నికలే తాజా ఉదాహరణగా వెల్లడించింది. వారు కొనసాగిస్తున్న ఆర్థిక పాలసీలు కార్పొరేట్ల ప్రయోజనాలకు మాత్రమే అని.. వారు తెస్తున్న పాలసీలు, చట్టాలు దేశంలోని ప్రజలకు, పార్టీలకు, సంఘాలకు అన్ని వర్గాలకు ప్రమాదకరమే అని లేఖలో తెలిపింది. అందరూ ఏకమై ఆర్ఎస్ఎస్, బీజేపీలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరుతున్నామని తెలంగాణ రాష్ట్ర కమిటీ లేఖలో పేర్కొంది



ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంది. న్యాయస్థానాలపై, రాజ్యాంగంపై రాహుల్ గాంధీకి, కాంగ్రెస్‌కు ఏమాత్రం గౌరవం లేదని మరోసారి తేలిపోయింది. కేవలం ఫోటోలకు పోజులిచ్చేందుకు చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగితే సరిపోదు. ఉపఎన్నికలు వస్తే ఓడిపోతామని కాంగ్రెస్ భయపడుతోంది.

\- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కేటీఆర్

ఓపెన్ వాయిస్

జెన్ జెడ్ యుద్ధభేరి

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ ట్రెండ్ మార్మోగుతోంది. 1995 నుంచి 2012 మధ్య జన్మించిన పిల్లలనే జనరేషన్ జెడ్ అని పిలుస్తారు. డిజిటల్ విప్లవం, అధునాతన స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్, ఏఐ యుగంలో వీళ్లు జన్మించారు. ముందు తరాలవారి వ్యవహారశైలికి వీరు భిన్నంగా ఉంటున్నారు. ప్రభుత్వాలు ఆంక్షలు విధించడాన్ని జెన్ జెడ్ అసలు అంగీకరించడం లేదు. బల్గేరియాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం తీవ్ర స్థాయికి చేరుకుంది. ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో పెరిగిన అవినీతి ఆరోపణలు, దేశవ్యాప్త నిరసనల కారణంగా ప్రధాని రాసెన్ జెలియాజ్‌కోవ్ నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వం రాజీనామా చేసింది. జెన్‌జీ దెబ్బకు మరో ప్రభుత్వం కూలిపోయింది. బల్గేరియా ప్రభుత్వం 2026 ముసాయిదా బడ్జెట్‌ను రూపొందించింది. ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ఈ బడ్జెట్‌ని రూపొందించారని యువత రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు. ప్రభుత్వం వెంటనే ముసాయిదా బడ్జెట్‌ను ఉపసంహరించుకున్నా, యువత ఆందోళనలు విరమించలేదు. ప్రధాని రాసెన్ జెలియాజ్‌కోవ్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాకముందే ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం చేపట్టాలని నిర్ణయించింది. అవిశ్వాస తీర్మానం పార్లమెంటులో ఓటింగ్‌కు రాకముందే.. తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు బల్గేరియా ప్రధాని ప్రకటించారు. ముఖ్యంగా బల్గేరియా యూరోజోన్‌లో చేరేందుకు కేవలం 20 రోజులు మాత్రమే ఉన్న కీలక తరుణంలో ఈ నిర్ణయం దేశ రాజకీయాల్లో అనూహ్య మలుపుగా మారింది. బల్గేరియాలో జెన్ జెడ్ సాగించిన అవినీతి వ్యతిరేక ఆందోళనల ధాటికి ప్రధాని రాసెన్ జెలియాజ్‌కోవ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం పతనమైంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా పూర్తి కాకముందే.. తమ ప్రభుత్వం రాజీనామా చేస్తున్నట్లు ప్రధాని గురువారం ప్రకటించారు. ఈ పరిణామం బల్గేరియా రాజకీయాల్లో అస్థిరతకు దారి తీసింది. పూర్తిస్థాయి ప్రజాదరణ ఉన్న ప్రభుత్వం ఏడాది కూడా పూర్తి చేయకుండానే కూలిపోవడంతో.. దేశంలో ఆకస్మిక ఎన్నికలు అనివార్యం కానున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. 2020లో బొయికో బోరిస్సోవ్ ప్రభుత్వాన్ని అవినీతి వ్యతిరేక నిరసనలు కూల్చినప్పటి నుంచి దేశంలో ఏడు ఎన్నికలు జరిగాయి. రాజీనామా చేయకముందు కూడా జెలియాజ్‌కోవ్ ప్రభుత్వం ఐదు అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కొని గట్టెక్కింది. జెన్ జెడ్ ఆందోళనలు బంగ్లాదేశ్ లోనూ చెలరేగాయి. అక్కడ కూడా ప్రభుత్వం కుప్పకూలింది. తాజాగా యువత చేతిలో నేపాల్ బలైంది. ఇప్పుడు పెరూ దేశం కూడా జెన్ జెడ్ ఆందోళనల ధాటికి అట్టుడుకిపోతుంది. ఈ సంవత్సరంలో మొత్తం 8 దేశాల్లో జెన్ జెడ్ ఆందోళనలు జరిగాయి. ఇండోనేషియాలో మొదలుపెట్టి ఇప్పుడు పెరూ వరకు వచ్చింది. సెప్టెంబర్ 27 న పెరూ రాజధాని లిమాలో వేలాదిమంది యువత రోడ్లపైకి వచ్చి ఆ దేశ అధ్యక్షుడు దినా బోలువార్టే కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెన్షన్ సిస్టమ్ లో పలు మార్పులు చేసినందుకు ఈ ఆందోళనలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మొదట్లో ఇండోనేషియాలో ఆ తర్వాత నెథర్లాండ్స్ లో జెన్ జెడ్ ఆందోళనలు చేపట్టింది.

ప్రతిపక్షం

హైదరాబాద్,

గురువారం
17.12.2025

గిరిజన అభివృద్ధి.. లోపభూయిష్టమైన ప్రణాళికలు

భారతదేశం బహుళ సంస్కృతులు, వైవిధ్యాలు మరియు జీవన విధానాలకు నిలయం. ఇక్కడ షెడ్యూల్డ్ తెగల జనాభా దేశ జనాభాలో 8.6 శాతం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, దశాబ్దాలుగా ఈ సమాజం అట్టడుగునే ఉండిపోయింది. గిరిజన సమాజం సహజ వనరుల సంరక్షణకు సంరక్షకులుగా ఉంటూ, దేశ సంస్కృతి, భాషా వైవిధ్యం, అసలైన జ్ఞాన వ్యవస్థల రూపకల్పనలో కీలక పాత్ర పోషించినప్పటికీ, వారికి సామాజిక-ఆర్థిక న్యాయం పూర్తి స్థాయిలో లభించలేదన్నది కఠోర వాస్తవం. ముఖ్యంగా నాయకత్వం, నైపుణ్యాలు మరియు సామాజిక నిర్మాణంలో గిరిజన మహిళల సహకారం వారు అర్హులైన మేరకు గుర్తించబడటం లేదు, ఇంకా వారు ప్రధాన అభివృద్ధి ప్రవాహం నుండి దూరంగానే ఉన్నారు.



వెంక గారి భూమయ్య
9848559863

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, 'సబ్కా సాథ్, సబ్కా వికాస్' అనే మంత్రం గిరిజన అభివృద్ధిలో మార్పు తీసుకువస్తుందని ప్రభుత్వం గట్టిగా పేర్కొంటోంది. ఈ నిబద్ధత బడ్జెట్ కేటాయింపులలో సంఖ్యాపరంగా స్పష్టంగా కనిపిస్తుంది. గిరిజన అభివృద్ధికి మొత్తం బడ్జెట్ కేటాయింపు 2024-25లో రూ.10,237.33 కోట్ల నుండి 2025-26లో రూ.14,925.81 కోట్లకు పెరిగింది. ఇది 45.79 శాతం పెరుగుదలను సూచిస్తుంది. అయితే, ఇంత భారీ మొత్తంలో నిధులు కేటాయించినప్పటికీ, ఈ అభివృద్ధి ఫలాలు క్షేత్ర స్థాయిలో వాస్తవంగా గిరిజన ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయనే దానిపై అనేక విమర్శలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఒక గిరిజన మహిళ అయిన ద్రౌపది ముర్మును దేశాధ్యక్షురాలిగా చేయడం చారిత్రక పరిణామమైనప్పటికీ, ఇది కేవలం 'టోకెనిజం' (నామమాత్రపు ప్రాతినిధ్యం) లాగా మిగిలిపోయిందనే విమర్శ ఉంది. విధాన రూపకల్పనలో గిరిజన మహిళల భాగస్వామ్యంపై ప్రభుత్వం పెద్దగా దృష్టి పెట్టలేదన్న వాదన బలంగా ఉంది. అభివృద్ధి కేవలం సౌకర్యాల విస్తరణకు మించి, వారికి నిజమైన గౌరవం, గుర్తింపు మరియు స్వావలంబనను హామీ ఇవ్వాల్సిన అవసరం ఉంది, కేవలం ఉన్నత స్థాయి పదవుల ద్వారా మాత్రమే కాకుండా, అట్టడుగు స్థాయి నిర్ణయాల్లో వారి మాట వినిపించడం ద్వారా ఈ లక్ష్యం నెరవేరుతుంది.

పథకాల అమలులో లోపాలు, నిర్లక్ష్యం

కేంద్రం అనేక కీలక పథకాలను ప్రవేశపెట్టినప్పటికీ, వాటి అమలు తీరు మరియు లక్షిత వర్గాలకు చేరువయ్యే విధానంపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గిరిజన మహిళలు సామాజిక, సాంస్కృతిక మరియు ఆర్థిక జీవనానికి కేంద్రంగా ఉన్నప్పటికీ, వారికి ఆర్థిక స్వావలంబన మరియు నాయకత్వ సంస్థాగతీకరణకు సంబంధించిన పథకాలు ఆశించినంత వేగంగా మరియు పారదర్శకంగా అమలు కావడం లేదు. బలహీన గిరిజన సమూహాల (పీవీటీజీ) కోసం ఉద్దేశించిన రూ. 24,104 కోట్ల విలువైన ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రచారాలు కూడా క్షేత్ర స్థాయిలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. సరైన పర్యవేక్షణ, అవగాహన లోపం కారణంగా ఈ అత్యంత బలహీన వర్గాలకు గృహనిర్మాణం, శుభ్రమైన నీరు, ఆరోగ్య సంరక్షణ వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించడంలో జాప్యం జరుగుతోంది. కేటాయింపులు జరుగుతున్నప్పటికీ, అవి సమర్థవంతంగా ఖర్చు చేయబడటం లేదనే విమర్శ ఉంది.

ఆర్థిక సాధికారతకు సంబంధించి, గిరిజన మహిళా సాధికారత పథకం కింద నాలుగు శాతం వడ్డీ రేటుతో రుణాలు అందిస్తున్నప్పటికీ, వ్యవస్థాపకతకు అత్యంత కీలకమైన అంశాలైన మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు, అటవీ ఉత్పత్తులకు సరైన కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. దీని కారణంగా స్వయం సహాయక బృందాల ద్వారా పొందిన ఆర్థిక స్వావలంబన పరిమితంగానే ఉండిపోతుంది. డీఏవై ఎన్ఆర్ఎల్ఎం వంటి పథకాలు సైతం గిరిజన మహిళల ఆర్థిక నిర్ణయాత్మక సామర్థ్యాన్ని పూర్తిగా బలోపేతం చేయలేక, కేవలం చిన్న తరహా రుణాలకు పరిమితమవుతున్నాయి.



విద్యా సవాళ్లు

విద్యారంగంలో కూడా పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసినప్పటికీ, అన్ని గిరిజన ప్రాంతాలకు నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు విస్తరించడంలో జాప్యం జరుగుతోంది. స్కాలర్‌షిప్ పథకాలు ఉన్నప్పటికీ, సరైన అవగాహన లేకపోవడం, అడ్మినిస్ట్రేటివ్ అడ్డంకుల కారణంగా గిరిజన పిల్లలు, ముఖ్యంగా బాలికలలో, పాఠశాల డ్రాపౌట్ రేట్లు ఇంకా ఎక్కువగానే ఉన్నాయి. షెడ్యూల్డ్ ప్రాంతాలకు విస్తరణ చట్టం1996 అమలు కూడా అనేక రాష్ట్రాలలో బలహీనంగా ఉంది. దీని ఫలితంగా గ్రామ్ సభల ద్వారా గ్రామీణ సమాజాలను బలోపేతం చేయాలనే లక్ష్యం నెరవేరడం లేదు. గిరిజన మహిళల సాధికారత యొక్క లక్ష్యం కేవలం కాగితాలపై గణాంకాలు పెరగడం లేదా భారీ నిధుల కేటాయింపులు చూపించడం కాదు. రూ. 79,000 కోట్లకు పైగా ఆమోదించబడిన గిరిజన మహిళా కృషి ఉత్కర్ష్ అభియాన్ వంటి కార్యక్రమాలు కూడా, క్రింది స్థాయికి చేరి, లబ్ధిదారులకు స్పష్టమైన మార్కెట్ అనుసంధానం మరియు పారదర్శకతను అందించినప్పుడే, ఈ లక్ష్యం నెరవేరుతుంది. ప్రభుత్వం చేస్తున్న భారీ కేటాయింపులు, పథకాల సమర్థవంతమైన అమలు ,పారదర్శకత ద్వారా మాత్రమే వాస్తవ ఫలితాలను అందించగలవు. లేదంటే, ఈ ప్రయత్నాలు గిరిజన సమాజం యొక్క నిజమైన అవసరాలను తీర్చకుండా, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించే ఒక నినాదంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. గిరిజన మహిళల సంక్షేమాన్ని కేవలం సంఖ్యాపరమైన 'పెరుగుదల'తో కొలవకుండా, వారి జీవన నాణ్యతలో వచ్చిన నిజమైన మార్పుల ద్వారా కొలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(వ్యాసకర్త సీనియర్‌జర్నలిస్టు)

అక్షరం అల్లాహ్ ప్రసాదించిన వరం



ముహమ్మద్ ముజాహిద్
9640622076

కాలాన్ని శాసించే శక్తి అక్షరానికే ఉంటే, ఆ అక్షరానికి ఆధ్యాత్మిక శోభను అద్ది, మానవాళికి జీవన మార్గాన్ని చూపిన దివ్య భాష 'అరబిక్'. ఇది కేవలం పెదవుల నుండి వెలువడే శబ్దం కాదు; హృదయపు లోతుల్లోంచి ఉద్భవించే ఒక దివ్య ప్రకంపన. మలయమారుతంలా మనసును తాకే మధురిమ దీని సొంతం. ఎడారి ఇసుక తిన్నెల్లో ఉద్భవించి, విశ్వవ్యాప్తమై, కోట్లాది ఆత్మలకు ఆధ్యాత్మిక ఊపిరిని పోస్తున్న ఈ భాష.. అల్లాహ్ తన అంతిమ సందేశాన్ని వినిపించడానికి ఎంచుకున్న ఒక పవిత్ర మాధ్యమం. ఖురాన్ వాక్యం ఈ భాషకు జీవనాడి అయితే, ప్రవక్త (స.అ.స) అమృతవాణి దీనికి అలంకారం. సాహితీ వనంలో వికసించిన ఈ అరబిక్ సుమము, జ్ఞాన పిపాసులకు ఒక పెన్నిధి, మోక్షం కోరేవారికి ఒక దివ్యౌషధం. శతాబ్దాల చరిత్రను తన గర్భంలో దాచుకుని, ఆధునిక యుగంలోనూ అగ్రగామిగా నిలుస్తున్న అరబిక్ భాషా వైభవాన్ని, దాని ప్రాముఖ్యతను వివరించే హృద్యమైన సంపాదకీయం మీకోసం... ప్రపంచ చరిత్రను, నాగరికత గమనాన్ని మలుపు తిప్పిన భాషలు కొన్ని మాత్రమే ఉన్నాయి. వాటిలో, అరబిక్ అత్యంత శక్తివంతమైన మరియు సుదీర్ఘ ప్రభావం కలిగిన భాషగా నిలుస్తుంది. ఇది దాదాపు పదిహేను శతాబ్దాలకు పైగా చరిత్రను మోసుకువస్తున్న అల్లాహ్ యొక్క దివ్య వాణికి మాధ్యమం. అరబిక్ కేవలం ఒక భాష కాదు; అది ఒక మహా నాగరికత, ఒక శక్తివంతమైన చరిత్ర, మరియు కోట్లాది మంది ప్రజల ఆధ్యాత్మిక జీవనానికి ఆధారం. మధ్యయుగాలలో ప్రపంచ విజ్ఞానానికి ప్రధాన కేంద్రంగా వెలిగిన ఈ భాష, ఒకప్పుడు ఆంగ్లానికి సమానమైన అంతర్జాతీయ స్థానాన్ని అనుభవించింది. నేటికీ, ఐక్యరాజ్యసమితి ఆరు అధికారిక భాషల్లో ఒకటిగా ఉండి, ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన భాషలలో 5వ స్థానంలో నిలవడం అరబిక్ అసాధారణ ప్రాముఖ్యతకు, అపారమైన ఆర్థిక శక్తికి ప్రతీక.

దైవిక మూలం: అల్‌ఖురాన్ వాక్కు, స్వర్గవాసుల భాష, మరియు ఇస్మాయిల్ వారసత్వం అరబిక్ యొక్క విశిష్టత ఇస్లాంతో ముడిపడి ఉంది. అల్లాహ్ తన పవిత్ర గ్రంథమైన అల్‌ఖురాన్‌ను ఈ దైవిక భాషలోనే అవతరింపజేశాడు. "దానిని ఖురానుగా చేసి అరబ్బీ భాషలో అవతరింపజేశాము." (ఖుర్‌ఆన్ 12:2) ఈ ఖురాన్ వాక్కు, ఈ భాష యొక్క ఔన్నత్యాన్ని, దాని లోతైన భావ వ్యక్తీకరణ సామర్థ్యాన్ని స్పష్టం చేస్తుంది. ప్రవక్త ముహమ్మద్ (స.అ.స) దీనిని స్వర్గవాసుల భాషగా అభివర్ణించడం ద్వారా, ఈ భాషకు మతపరమైన, ఆధ్యాత్మిక ఉన్నతిని కల్పించారు.



ప్రాముఖ్యత: ముస్లింలకు నమాజ్ (ప్రార్థనలు) చేయాలన్నా, ఇస్లాం మూల సూత్రాలను అర్థం చేసుకోవాలన్నా అరబిక్ జ్ఞానం తప్పనిసరి. అందుకే ఇమామ్ ఉమర్ (ర.అ) "అరబిక్ నేర్చుకోండి, అది మీ ధర్మంలో భాగం" అని నొక్కి చెప్పారు.

చారిత్రక మూలం: హదీస్ ప్రకారం, స్పష్టమైన అరబిక్ మాట్లాడిన మొట్టమొదటి వ్యక్తి ప్రవక్త ఇస్మాయిల్ (అ.స). ఈ ఫుషా అరబిక్ ఇప్పటికీ అరబ్ లీగ్‌లో భాగమైన 22 అరబిక్ మాట్లాడే దేశాలలో ప్రభుత్వం, మీడియా మరియు విద్యకు అధికారిక భాషగా ఉంది.

జ్ఞాన కేంద్రం: విజ్ఞాన వారసత్వ వారధి మరియు నాగరికతకు ఆధారం. మధ్యయుగాలలో అరబిక్ భాష విజ్ఞాన శాస్త్రాలకు, తత్వానికి, సాహిత్యానికి కేంద్రంగా వెలిగింది. అపారమైన మేధో సంపదను అరబిక్ తనలో ఇముడ్చుకుంది. గణితం, వైద్యం, ఖగోళ శాస్త్రం, తత్వశాస్త్రం వంటి రంగాలలో ఈ భాష పోషించిన పాత్ర అద్వితీయమైనది. గ్రీకు, రోమన్ మరియు భారతీయ జ్ఞానాన్ని ప్రపంచానికి అందించిన జ్ఞాన వారధి అరబిక్. ఈ భాషలోని లోతైన వ్యాకరణ నిర్మాణం (నహ్వ్), పదాల సంక్షిప్తత మరియు ఆలోచనల ఏకాగ్రత - ఈ ప్రపంచ మేధో వారసత్వాన్ని మరింత సుసంపన్నం చేశాయి. ఇమామ్ ఇబ్న్ తైమియ్యాహ్ అన్నట్లుగా: "అరబిక్ భాష ఇస్లాం మరియు ముస్లింల చిహ్నం."

అంతర్జాతీయ ప్రాధాన్యత: వ్యూహాత్మక మరియు ఆర్థిక ఆయుధం... కోట్లాది మందికి మాతృభాషగా, అరబిక్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఒక శక్తివంతమైన మాధ్యమం. ఇది ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే నాల్గవ భాషగా ఉంది, దీనిని ప్రతిరోజూ 400 మిలియన్ల కంటే ఎక్కువ మంది ఉపయోగిస్తున్నారు. 1973లో ఐక్యరాజ్యసమితి దీనిని తన ఆరవ అధికారిక భాషగా గుర్తించింది, ఇది ఈ భాషకున్న తిరుగులేని అంతర్జాతీయ ప్రాధాన్యతను నిరూపిస్తుంది. ఈ భాషను నేర్చుకోవడం ద్వారా అరబ్ ప్రపంచంలోని ఆర్థిక, సాంస్కృతిక మరియు సామాజిక పురోగతిని, గొప్ప మేధో వారసత్వాన్ని మనం అర్థం చేసుకోగలుగుతాం. భారతదేశం విషయానికి వస్తే, అరబిక్ నేర్చుకోవడం యువతకు అనంత అవకాశాల మహాద్వారం. గల్ఫ్ దేశాలలో అధిక వేతనాల ఉద్యోగాలు, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో కీలక పాత్రలు వంటి అవకాశాలన్నీ అరబిక్ భాషా పరిజ్ఞానం ఉన్న భారతీయ యువత కోసం ఎదురు చూస్తున్నాయి.

దైవిక హెచ్చరిక: అరబిక్ యొక్క పవిత్రత

అరబిక్ భాష ఉత్తమమైనది, సులభమైనది మరియు అత్యంత సుందరమైనది. అరబిక్ భాషను, దాని వ్యాకరణ నియమాలను (నహ్వ్) లేదా అలంకార శాస్త్రాలను (బలాగా) దూషించడం లేదా తక్కువచేయడం నిషిద్ధం, ఎందుకంటే అవి ఖురాన్ మరియు హదీసులను అర్థం చేసుకోవడానికి దోహదపడతాయి. అరబిక్ భాషను లేదా దానిలోని ఒకే ఒక అక్షరాన్ని కూడా దూషించే లేదా తక్కువచేసే వ్యక్తి ముస్లిం కాదు. ఈ కారణంగా, మనం మన నాలుకలను అనవసరమైన మరియు నిషిద్ధమైన మాటల నుండి, ముఖ్యంగా దైవిక భాషను కించపరిచే మాటల నుండి రక్షించుకోవాలి.

హృదయానికి పిలుపు: వారసత్వాన్ని అందిపుచ్చుకోండి ప్రియమైన యువత, అరబిక్ భాషను కేవలం మతపరమైన కోర్సుగా చూడకండి. ఇది భవిష్యత్తు వైపు వేసిన ఒక శక్తివంతమైన అడుగు. ఇది కేవలం నిరుద్యోగాన్ని పరిష్కరించే మార్గం కాదు; ఇది మీ మేధో సామర్థ్యాన్ని అంతర్జాతీయ వేదికకు పరిచయం చేసే మాధ్యమం. ఇమామ్ షాఫీ (ర.అ.) వంటి న్యాయవాదులు తమ వారసత్వంలో సగాన్ని అరబిక్ వ్యాకరణానికి అంకితం చేశారు. అరబిక్ భాష మానవజాతి సాంస్కృతిక వైవిధ్యానికి ఒక మూల స్తంభం. అరబిక్ నేర్చుకుని, ఈ దైవిక, మేధో మరియు ఆర్థిక వైభవాన్ని అందిపుచ్చుకోండి!

(డిసెంబర్18: అరబిక్‌భాషా దినోత్సవం సందర్భంగా)

(వ్యాసకర్త ఆధ్యాత్మిక రచయిత)

హక్కుల పరిరక్షణతోనే మైనారిటీల అభ్యుదయం



యండి. ఉస్మాన్ ఖాన్
99125 80645

డిసెంబర్ 18 మైనారిటీ హక్కుల దినోత్సవం. రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వం, సమాన అవకాశాలు, న్యాయం వంటి విలువలను మళ్లీ ఒకసారి మననం చేసుకునే రోజు. అయితే ఈ దినోత్సవం ప్రతి ఏడాది వచ్చిపోతున్నప్పటికీ, దేశంలో అతిపెద్ద మైనారిటీ వర్గంగా ఉన్న ముస్లిం సమాజానికి నిజంగా తన హక్కులు తనకు దక్కుతున్నాయా అనే ప్రశ్నకు మాత్రం సంతృప్తికరమైన సమాధానం లేదు. విద్య, ఉద్యోగాలు, ఆర్థిక అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి కీలక రంగాల్లో ముస్లిం మైనారిటీల స్థితిని పరిశీలిస్తే, హక్కులు చాలా గొప్పగా చట్టాలలో నిక్షిప్తమై ఉన్నా అవి నిత్య జీవితంలో నిజాలుగా మారడంలేదని స్పష్టంగా కనిపిస్తోంది. దేశ జనాభాలో సుమారు పద్నాలుగు శాతం పైగా ఉన్న ముస్లిం సమాజం, విద్యా రంగంలో ఇప్పటికీ వెనుకబాటులోనే ఉంది. ప్రాథమిక స్థాయిలో విద్యలో చేరికలు ఉన్నప్పటికీ, హైస్కూల్, ఇంటర్మీడియట్ దశలు దాటే సరికి డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి. ఉన్నత విద్యలో ప్రవేశించే ముస్లిం విద్యార్థుల శాతం జాతీయ సగటుతో పోలిస్తే చాలా తక్కువగా ఉంది. దీనివల్ల నైపుణ్యాధారిత ఉద్యోగాలు, వృత్తిపరమైన అవకాశాలు అందని ద్రాక్షలా మారుతున్నాయి. విద్యలో ఏర్పడే ఈ అంతరం, తర్వాతి దశలో ఉద్యోగ, ఆదాయ అసమానతలకు బలమైన పునాదిగా మారుతోంది. ఉద్యోగ రంగంలోనూ ఇదే పరిస్థితి. ప్రభుత్వ ఉద్యోగాలు, పబ్లిక్ సెక్టార్ సంస్థలు, నిర్ణయాత్మక స్థాయిల్లో ముస్లిం ఉద్యోగుల ప్రాతినిధ్యం అత్యంత పరిమితంగా కనిపిస్తోంది. ప్రతిభకు అవకాశాలు కల్పిస్తామనే ప్రకటనలు బాగానే ఉన్నా, పోటీ పరీక్షలకు అవసరమైన కోచింగ్, ఆర్థిక మద్దతు, మార్గదర్శనం వంటి మౌలిక అంశాలు చాలా ప్రాంతాల్లో ముస్లిం యువతకు అందడం లేదు. ఫలితంగా పెద్ద సంఖ్యలో యువత అసంఘటిత రంగాల్లో, తక్కువ ఆదాయపు ఉద్యోగాల్లోనే పరిమితమవుతోంది.

ఆర్థికంగా కూడా ముస్లిం మైనారిటీలు వెనుకబాటును ఎదుర్కొంటున్నారు. స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు ముస్లిం సమాజంలో ఎక్కువగా ఉన్నప్పటికీ, బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి రుణాలు, ఆర్థిక సహాయం పొందడంలో అడ్డంకులు ఎదురవుతున్నాయనే వాస్తవం పలు అధ్యయనాల్లో వెలుగులోకి వచ్చింది. ఆర్థిక వనరులు అందుబాటులో లేకపోవడం వల్ల చిన్న వ్యాపారాలు విస్తరించలేక, తరతరాల పేదరికపు చక్ర బంధంలో చిక్కుకుపోతున్నారు. ఆర్థిక వెనుకబాటు విద్య, ఆరోగ్యం, నివాసం వంటి ఇతర రంగాలపై కూడా ప్రభావం చూపుతోంది. ఇక రాజకీయ ప్రాతినిధ్యం విషయానికి వస్తే, దేశ జనాభాలో ముస్లింల వాటాకు తగిన స్థాయిలో శాసనసభ, పార్లమెంటు, స్థానిక సంస్థల్లో వారి ప్రాతినిధ్యం కనిపించడం లేదు. రాజకీయ నిర్ణయాలలో భాగస్వామ్యం లేకపోవడం వల్ల ముస్లిం సమాజానికి సంబంధించిన సమస్యలు విధానాల రూపకల్పనలో ప్రాధాన్యం కోల్పోతున్నాయి. ప్రజాస్వామ్యంలో సంఖ్యాబలం మాత్రమే కాకుండా, స్వరం వినిపించే స్థానం కూడా అవసరం. ఆ స్థానం బలహీనంగా ఉండటమే హక్కుల అమలులో ప్రధాన లోపంగా మారింది. ఈ పరిస్థితుల్లో మైనారిటీ హక్కుల దినోత్సవం కేవలం ఒక మొక్కుబడి తేదీగా మిగిలిపోకుండా, ఆత్మపరిశీలనకు ఆలంబనగా మారాలి. ముస్లిం మైనారిటీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు నిజంగా అందాలంటే, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సులభ రుణ సదుపాయాలు, రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం వంటి అంశాలపై ప్రభుత్వాలు స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

(వ్యాసకర్త సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి చేస్తాం



కూకట్ పల్లి, ప్రతిపక్షం డిసెంబర్ 17: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు చేపడుతున్న వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఎంఎల్ఏ ఆరెకపూడి గాంధీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎం.ఎల్.ఎ గాంధీ మాట్లాడుతూ ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజుల రామరం వెళ్లే రోడ్డు వయా ఎల్లమ్మబండ రోడ్డు నిత్యం ట్రాఫిక్ సమస్య తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు అని ,ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగినది అని ,దానిలో భాగంగా తీసుకోవాల్సిన చర్యల పై అధికారులు, కార్పొరేటర్ తో కలిసి ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర గా స్వయంగా నడుచుకుంటూ వెళ్లడం జరిగినది అని గాంధీ తెలియచేసారు. 100 ఫీట్ రోడ్డు విస్తరణ లో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సిన చర్యల పై చర్చించి, ప్రణాళిక ను రూపొందించి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని , యుద్ధప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, రోడ్డు విభాగిని పనులు నాణ్యత ప్రమాణాలు తో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని , నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, అధికారులను ఎంఎల్ఏ గాంధీ అదేశించారు. ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని ఎం.ఎల్.ఎ అరికెపూడి గాంధీ తెలియచేశారు. అదేవిధంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ,నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పి ఏ సి చైర్మన్ అరికపూడి గాంధీ పునరుద్ఘాటించారు.

కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రతిపక్షం, షాద్ నగర్: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్య పడుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఫరూక్ నగర్ మండలం ఎలికట గ్రామానికి చెందిన ముఖ్య బిఆర్ఎస్ నాయకులు గ్రామ మాజీ ఎంపీటీసీ కావలి శ్రీశైలం తదితరులు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏలికట్ట కాంగ్రెస్ నాయకులు బుద్దా నర్సింహ, గున్న శర్వలింగం, రాజు హాజరు కాగా వార్డ్ మెంబర్స్ పిట్టెల కమలమ్మ బోనయ్య, గోనెల రాము, గుల్లే ప్రమీల, భవాని మాత టెంపుల్ మాజీ చైర్మన్ గుల్లే కృష్ణయ్య తదితరులు కాంగ్రెస్ పార్టీలో కలవడం జరిగింది. సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఎవరెన్ని వేషాలు వేసిన జిమ్మిక్కులు చేసిన గజకన్న గోకర్ణ టక్కు టమాటా విద్యలు ప్రదర్శించిన కాంగ్రెస్ పార్టీ పట్టించుకోదని ప్రతిపక్షాలు చేసే కుట్రలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ఎత్తుగడలు వేస్తూనే ఉంటుందని అన్నారు. పార్టీలో చేరిన టిఆర్ఎస్, బిజెపి నాయకులకు ఆయన స్వాగతం పలుకుతూ వారికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు

- పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలను సందర్శించిన
- కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఎన్నికల సాధారణ పరిశీలకులు



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 17 : మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. నిజాంపేట్ మండల కేంద్రంతో పాటు ర్యాలమడుగు గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, పోలింగ్ బూత్‌లలో చేపట్టిన ఏర్పాట్లు, క్యూలైన్ నిర్వహణ విధానం, ఓటర్లకు అందుతున్న సౌకర్యాలు, ముఖ్యంగా వికలాంగులు మరియు వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సదుపాయాలను పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఎన్నికల సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం కల్హేర్ మండలం రాపర్తి గ్రామంలోని కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి, కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, తదితరాలను పరిశీలించి తగిన మార్గదర్శకాలు ఇచ్చారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు కార్తీక్ రెడ్డి నిజాంపేట్, బాచిపల్లి, మీర్‌ఖాన్‌పేట్, రాపర్తి, కడ్పల్, సిర్గాపూర్, చాప్ట(కె), ఆకుల లింగపురం గ్రామాల పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ సరళి, పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ వాసర్, కంగ్టి, కల్హేర్, కడ్పల్ గ్రామాల పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాలలో పరిస్థితులు, ఉప సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన వివిధ ఫారాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలో మూడు విడతలలో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగాయని,ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.

కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 17 : స్వామియే శరణం అయ్యప్ప.. అయ్యప్ప శరణం స్వామియే.. శరణం శరణం అయ్యప్ప శరణం అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామం మారుమ్రోగింది. ఆ గ్రామానికి చెందిన కె. రమణ స్వామి ఆధ్వర్యంలో గ్రామంలో అయ్యప్పస్వామి మహాపడి పూజ మహోత్సవం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. గురుస్వాముల నేతృత్వంలో జరిగిన పూజా కార్యక్రమంలో వందలాది మంది అయ్యప్ప స్వాములు పాల్గొని అయ్యప్ప నామ స్మరణం, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించారు.అయ్యప్ప స్వాములు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ అయ్యప్ప స్వామిని కీర్తిస్తూ మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. 18 పడి మెట్లకు పూజలు చేశారు.అనంతరం ఇరుముడులు కట్టుకుని అయ్యప్ప స్వాములు శబరిమలకు బయల్దేరారు. అనంతరం, స్వాములకు, భక్తులకు బాత్కు నవనీతశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు,భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.



వచ్చే ఎన్నికల్లో బీజేపీ దే అధికారం

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 17 : వచ్చే ఎన్నికల్లో బీజేపీ దే అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గం లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు సర్పంచులుగా గెలుపొందగా.. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలో ఎమ్మెల్సీ స్వగృహం లో కలిశారు. ఈ మేరకు గెలిచిన సర్పంచులను బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి తో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్టంలో ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేశారని, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామస్థాయిలో ఖర్చు చేయకుండా, కేంద్ర నిధులను దారి మళ్లించడం వల్ల గ్రామాల అభివృద్ధి నిలిచిపోయిందని గుర్తు చేశారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే అనేక మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. పంచాయతీ వ్యవస్థను గత రెండేళ్లుగా పూర్తిగా నిర్వీర్యం చేశారని అన్నారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా ఉమ్మడి మెదక్ జిల్లాలో బీజేపీ అత్యదిక స్థానాలు గెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, నాయకులు గొల్ల భాస్కర్, సుభాష్ తదితరులు ఉన్నారు.



క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

- శాతవాహన ఉపకులపతి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 17: శాతవాహన విశ్వవిద్యాలయంలోని న్యాయ కళాశాలలో స్పోర్ట్స్ లాంజ్ (ఆటలగది)ని ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని న్యాయ విద్యార్థులు తమ ఆటవిడుపు కోసం క్యారమ్స్,చెస్, టేబుల్ టెన్నిస్ వంటి అంతర ఆటలను ఆడి తమ ఆత్మ ధైర్యాన్ని, శారీరకద్రుఢత్వాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. వచ్చే సంవత్సరం వరకు న్యాయ కళాశాలకు కొత్త భవనాన్ని నిర్మిస్తామని పురుషులకు, మహిళలకు ప్రత్యేక హాస్టల్ సదుపాయాన్ని కూడా తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయ విద్యార్థులతో టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్ ఆడారు. ఈ కార్యక్రమంలో న్యాయ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సూరేపల్లి సుజాత, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ నజీముద్దీన్ మున్వర్, డాక్టర్ కన్నా, ఫిజికల్ డైరెక్టర్ డి విజయ్ కుమార్, కుతాడి శీను, న్యాయ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



హైదరాబాద్ క్రికెట్ మ్యాచ్‌లో

సత్తా చాటిన ప్రేమ్ సాయి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 17: హైదరాబాదులో బుధవారం జరిగిన అండర్ 14 క్రికెట్ మ్యాచ్లో కరీంనగర్ ఉమ్మడి జిల్లా తరఫున ఆడిన ప్రేమ్ సాయి సత్తా చాటాడు. నాలుగు వికెట్లు తీయడంతో పాటు 13 పరుగులు చేసి నాట్ అవుట్ గా నిలిచాడు. కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ తో పాటు సుఫా క్రికెట్ అకాడమీ కోచ్ తదితరులు ప్రేమ్ సాయిని అభినందించారు.



మంత్రి 'పొన్నం' ఇలాకా హస్తం హవా

- మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ కైవసం
- గెలిచిన అభ్యర్థులకు 'మంత్రి' అభినందనలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 17: హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నుండి పంచాయతీ ఎన్నికల సరళి నీ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యవేక్షించారు. నియోజకవర్గ పరిధిలోని సైదాపూర్ , కొహెడ, అక్కన్నపేట , హుస్నాబాద్ మండలాల్లో ఈరోజు మూడవ విడత పంచాయతీ రాజ్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తుండటంతో మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మద్దతు దారులు సర్పంచులుగా విజయం సాధిస్తుండటంతో వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.నిరంతరం ప్రజా సమస్యలపై ప్రజలకు అండగా ఉన్న నాయకులకు ప్రజలు పట్టం కట్టారని, గెలిచిన అభ్యర్థులు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ గ్రామాల అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలని సూచించారు.హుస్నాబాద్ మండలంలో 17 గ్రామ పంచాయతీ లకు 15 గ్రామ పంచాయతీ లు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయం సాధించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మూడవ దశలో జరిగిన నాలుగు మండలాల్లో హస్తం హవా సాగింది. మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకున్నారు. గెలిచిన అభ్యర్థులకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలిపారు.

ముగిసిన పంచాయతీ ఎన్నికలు

- జిల్లాలో మూడో విడత పోలింగ్ ప్రశాంతం



ప్రతిపక్షం, హనుమకొండ,డిసెంబర్ 17: నాలుగు మండలాల్లో 86.45 శాతం పోలింగ్ నమోదు. హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ గ్రామపంచాయతీ ఎన్నికల మూడో దశ పోలింగ్ హనుమకొండ జిల్లాలోని నాలుగు మండలాల్లో బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ వెల్లడించారు. జిల్లాలో మూడో విడత ఎన్నికలలో భాగంగా ఆత్మకూరు, దామెర, నడికూడ, శాయంపేట మండలాల్లో ఉదయం 7 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరిగిందని పేర్కొన్నారు. నాలుగు మండలాల్లో పోలింగ్ శాతం 86.45 నమోదైయ్యింది. ఆయా మండలాల పరిధిలో ఓటు హక్కు ను వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటవరకు పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం రెండు గంటలకు కౌంటింగ్ కేంద్రాలలో సర్పంచ్, వార్డు స్థానాలకు పోలైన ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. అభ్యర్థుల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ను ఎన్నికల అధికారులు మొదలుపెట్టారు. వార్డులు, సర్పంచ్ అభ్యర్థులకు వచ్చిన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ఎన్నికల అధికారులు వెల్లడించారు.

మండలాల వారీగా పోలైన ఓట్లు

ఆత్మకూర్ మండలంలో 24844 ఓట్లు పోల్ కాగా 87.43 పోలింగ్ శాతం నమోదయ్యింది. దామెర మండలంలో 19602 ఓట్లు పోల్ కాగా 89.58 పోలింగ్ శాతం, నడికూడ మండలంలో 23362 ఓట్లు పోల్ కాగా 85 పోలింగ్ శాతం, శాయంపేట మండలంలో 28436 ఓట్లు పోల్ కాగా 84.74 పోలింగ్ శాతం నమోదయింది. ఈ నాలుగు మండలాల్లో మొత్తం 96244 ఓట్లు పోల్ కాగా 86.45 పోలింగ్ శాతం నమోదైయ్యింది.

మూడు విడతలు ప్రశాంతం

గ్రామపంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించగా జిల్లాలో మూడు దశలు ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. మొదటి విడత ఎన్నికలు ఈ నెల 11వ తేదీన, 14న రెండో విడత ఎన్నికలు జరిగాయి. గ్రామపంచాయతీలకు మూడో విడత ఎన్నికలు బుధవారం (17వ తేదీన) జిల్లాలోని నాలుగు మండలాల్లో ప్రశాంతంగా ముగిశాయి. హనుమకొండ జిల్లాలో తొలి విడత లో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగగా, రెండో విడతలో ధర్మసాగర్, హసన్ పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లో ఎన్నికలు జరిగాయి. మూడో విడతలో జిల్లాలోని ఆత్మకూరు, దామెర, నడికూడ, శాయంపేట మండలాలకు సంబంధించిన గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు బుధవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు విడతల్లో నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయడంతో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యాయి. శాయంపేట, దామెర మండల కేంద్రాల్లోని గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం పరిశీలించారు. శాయంపేట మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి పోలింగ్ సరళి, ఓటింగ్ శాతం గురించి ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

- కండువా కప్పి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, డిసెంబర్17: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ప్రజాపాలనకు ఆకర్షితులై యువత స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన సుమారు 50 మంది యువకులు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, డిసిసి అధ్యక్షుడితో పాటు మాజీ అధ్యక్షులు నాగుల సత్యనారాయణ, టౌన్ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ అధ్యక్షులు సూర దేవరాజు కండువా కప్పి యువకులను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజాపాలనకు ఆకర్షితులై యువత కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించిందని, అదే ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో భారీగా ప్రజాప్రతినిధులను గెలిపించుకునేలా పార్టీ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు పెద్దపీట వేస్తున్న తరుణంలో అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తు ముందుకెళుతున్నామని చెప్పారు. పార్టీ పటిష్టత కోసం నిబద్ధతతో పని చేయాలని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ నూతనంగా పార్టీలో చేరిన యువకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ జిల్లా సభ్యులు సంగీతం శ్రీనాథ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డిమల్ల భాను, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, యూత్ కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు పోగుల దేవరాజు, పట్టణ యూత్ మాజీ అధ్యక్షుడు చిందం శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ సెక్రటరీ ఆకేని సతీష్, నాయకులు కలిం, ఆడెపు ప్రసాద్, రాపల్లి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయం

"



రీ సర్వే చేసిన గ్రామాల్లో వచ్చే సంక్రాంతికి 21 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తాం. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలి. భూముల రీ క్లాసిఫికేషన్‌పై దాదాపు లక్ష ఫిర్యాదులు వచ్చాయి. వాటిని వెంటనే పరిష్కరించాలి. ప్రైవేట్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసే అధికారం కలెక్టర్లకు ఇస్తాం.

- ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రాంతీయం



ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుకు సన్మానం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 16: ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో హవేలీ ఘన్పూర్ మండలం లోని మేజర్ గ్రామపంచాయతీ అయిన బూర్గుపల్లి గ్రామపంచాయతీ నూతన సర్పంచిగా నవ తెలంగాణ జర్నలిస్ట్ పనిచేస్తున్న సాయిలు విజయం సాధించారు. అత్యధికంగా 888 మెజార్టీ ఓట్లతో గెలు పొందడం విశేషం ఈ సందర్భంగా బుధవారం మెదక్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించా రు. ఈ కార్యక్రమంలోప్రెస్ క్లబ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శు లు నరేష్‌గౌడ్, ప్రసాద్ మెదక్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు బొందుగుల నాగరాజు. రాజశేఖర్ ప్రకాష్ గోపాల్ గౌడ్ రియాజ్.బివికే రాజు. సంగమేశ్వ ర్.శ్రీహరి గౌడ్. కార్తీక్ పనిరాజు అల్లాడి శేఖర్. లక్ష్మణ్. రాహుల్. రామకృష్ణ. సుబ్బు.తదితరులు ఉన్నారు ఈ సందర్భంగా సాయిలుకు జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ గ్రా మంలోని గ్రామస్తులు కుల పెద్దలు అన్ని రాజకీయ పార్టీ నాయకులు తనకు సహకరించారని వారి సహకారంతో జిల్లాలో అత్యధికంగా మెజార్టీ రావడం జరిగిందని గ్రా మస్తులు అందరికీ ఎల్లప్పుడూ కృతజ్ఞతగా ఉంటాడని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో గ్రా మాన్ని అభివృద్ధి పరుస్తానని ఆయన తెలిపారు.



పాత సామాన్ల డంపింగ్ యార్డులో భారీ అగ్నిప్రమాదం

ప్రతిపక్షం, మిడిదొడ్డి, డిసెంబర్ 17: సిద్దిపేట జిల్లా అక్బరుపేట/భూంపల్లి మండల కేంద్రంలో పాత ఇనుప సామాన్ల దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిప్రమాదంలో దుకాణంలో ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, రాగి, సామాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే మంటలు భారీగా ఎగిసిపడి, పొగ దట్టంగా కమ్ముకున్నాయి. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే భూంపల్లి ఎస్ఐ హరీష్ తోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే దుబ్బాక అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అగ్ని ప్రమాదంలో జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు.



కాలం చెల్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు

- మెదక్ జిల్లా ఆహార భద్రత అధికారి స్వదీప్ కుమార్
- అమోఘ్ గ్రాండ్ రెస్టారెంట్‌లో ఆహార భద్రతా అధికారి విస్తృత తనిఖీలు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 17: కాలం చెల్లిన ఆహార పదార్థాలు తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా ఆహార భద్రత అధికారి స్వదీప్ కుమార్ హెచ్చరించారు. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని అమోఘ్ గ్రాండ్ రెస్టారెంట్ లో ఆహార భద్రతా అధికారి బుధవారం విస్తృత తనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీలో గడువు ముగిసిన ఆహార ఉత్పత్తులు దుకాణంలో బూజు బట్టిన ఉన్న పాపడ్‌లు కనిపించాయి, స్టోర్ రూమ్‌లో దొరికిన గడువు ముగిసిన షెజ్వాన్ సాస్ బాటిళ్లను రెస్టారెంట్ లోని చైనీస్ వంటగదిలో ఉపయోగిస్తున్నారు.ఈ వస్తువులను ధ్వంసం చేశారు. ఇతర ఉల్లంఘనలను గుర్తించి నోటీసు జారీ చేశారు, జరిమానా విధించడానికి కేసు నమోదు చేయడానికి పంచమామ చేశారు. ఈ సందర్భంగా ఆహార భద్రత తనిఖీ అధికారి స్వదీప్.కుమార్ మాట్లాడుతూ.... ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న హోటల్ లో రెస్టారెంట్లు యాజమాన్యాలపై ఫుడ్‌సేఫ్టీ ఉక్కుపాదం మోపుతున్నదని హెచ్చరించారు. హోటళ్లు, రెస్టారెంట్ల పై ,చర్యలు తీసుకుని, ఆహార భద్రత ప్రమాణాలను మెరుగు పరచడమే విస్తృత తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్ మార్కెట్లు, ఐస్‌క్రీం పార్లర్లు ఇతర వాటిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు.ఈ తనిఖీలలో ఫుడ్ శాంపిల్స్ అసిస్టెంట్ నజీర్, సిబ్బంది, అరవింద్ పాల్గొన్నారు.



ముండ్రాయి సర్పంచిగా సంచార జాతులకు చెందిన మహిళ

- అభినందించిన గంగిరెద్దుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ప్రతిపక్షం, నంగునూరు, డిసెంబర్ 17: సంచార జాతులకు చెందిన గంగిరెద్దుల వర్గానికి చెందిన మహిళ జిడ్డి చామంతి సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గ్రామ సర్పంచ్ గా గెలుపొంది చరిత్ర సృష్టించారని గంగిరెద్దుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జిడ్డి కనకయ్య అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ముండ్రాయి గ్రామ సర్పంచ్‌గా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన సంచార జాతికి చెందిన గంగిరెద్దుల వర్గానికి చెందిన మహిళ జిడ్డి చామంతిని తెలంగాణ రాష్ట్ర గంగిరెద్దుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. తెలంగాణ గంగిరెద్దుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిడ్డి కనకయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టీచర్ వెంకన్న ఆధ్వర్యంలో బుధవారం ముండ్రాయిలో అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిడ్డి చామంతిని సన్మానించారు. అనంతరం గంగిరెద్దుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిడ్డి కనకయ్య, గౌరవాధ్యక్షుడు టీచర్ వెంకన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గంగిరెద్దుల కులం నుంచి సర్పంచ్‌గా గెలిచిన ఏకైక మహిళగా నిలిచిన జిడ్డి చామంతికి ప్రత్యేక గౌరవం లభించిందన్నారు. జిడ్డి చామంతి గెలుపుకు కృషి చేసిన సిద్దిపేట జిల్లా గంగిరెద్దుల సంఘం జిల్లా అధ్యక్షుడు మెండె మల్లేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిడ్డి సారయ్యలను శాలువాలతో సన్మానించారు. గంగిరెద్దుల సంఘం ప్రతినిధులు జిడ్డి వెంకట్, వెంకటయ్య, కాసిం, ఆవుల మల్లయ్య, జన్నె బోయిన సారయ్య, గ్రామ ప్రజలు, గంగిరెద్దుల సంఘం మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.





చివరి దశ పోలింగ్ ప్రశాంతం

- కరీంనగర్ జిల్లాలో 86.42 శాతం పోలింగ్
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో 79.14 శాతం
- జగిత్యాల జిల్లాలో 79.64 శాతం
- పెద్దపల్లి జిల్లాలో 85.66 శాతం నమోదు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 17: జిల్లాలో మూడు దశల్లో జరిగిన పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని, మొదటి, రెండవ విడత ఎన్నికల మాదిరిగానే చివరి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సజావుగా పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో మొత్తంగా 86.42% ఓట్లు పోలయ్యాయి. మండలాల వారీగా పరిశీలిస్తే ఇల్లందకుంట లో 87.05%, హుజరాబాద్ లో 85.04, జమ్మికుంట లో 85.72 వీణవంక 85.87 సైదాపూర్ 87.85 శాతంగా నమోదయింది.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడో ఫేజ్ పోలింగ్ శాతం 79.14

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడో ఫేజ్ ఎన్నికల పోలింగ్ శాతం నమోదు అయింది. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లో బుధవారం పోలింగ్ నిర్వహించారు. నాలుగు మండలాల్లో కలిపి మొత్తం 1,25,324ఓట్లు ఉండగా, 99,183పోల్ అయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 79.14 శాతం పోలింగ్ నమోదు అయింది.

జగిత్యాల జిల్లాలో పోలింగ్ శాతం 79.64

జగిత్యాల జిల్లాలో మొత్తం 1,71,920 ఓట్లలో పోలైన ఓట్లు 1,36,917 గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడవ విడత ఎన్నికల పోలింగ్ 79.64 శాతం నమోదు అయింది. బుగ్గారం, ధర్మపురి, ఎండపెల్లి, గొల్లపెల్లి, పెగడపెల్లి, వెల్గటూర్ మండలాల్లో బుధవారం పోలింగ్ నిర్వహించారు. 6 మండలాల్లో కలిపి మొత్తం ఓట్లు 1,71,920 ఉండగా పోల్ 1,36,917 అయ్యాయి. 79.64 శాతం పోలింగ్ నమోదు అయింది.

పెద్దపల్లి జిల్లాలో పోలింగ్ 85.66 శాతం నమోదు

పెద్దపల్లి జిల్లాలో ఓదెల మండలం కొలనూరు జెడ్పీహెచ్ఎస్, పెద్దపల్లి మండలం పెద్ద కాల్వల ఎంపీపీ ఎస్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశాను .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మూడవ విడత 85 గ్రామ పంచాయతీలకు, 636 వార్డులకు నిర్వహించిన పోలింగ్ లో 85.66 శాతం మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో మూడవ విడత 85.66 శాతం పోలింగ్ నమోదైందని అన్నారు.




ఒకే ఇంట్లో ఇద్దరు వార్డు సభ్యులు

- ఎన్నికల్లో గెలిచిన వదిన, మరిది

ప్రతిపక్షం, కొమురవెల్లి, డిసెంబర్ 17: మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా కొమురవెల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఒకే కుటుంబానికి చెందిన వదిన, మరిది ఇద్దరు వార్డు సభ్యులుగా బుధవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొమురవెల్లిలో గ్రామపంచాయతీకి జరిగిన ఎన్నికలలో 2వ వార్డు సభ్యురాలుగా గజ్జె లావణ్య అశోక్ ఎన్నిక కాగా 4వ వార్డు సభ్యుడిగా గజ్జె వెంకటేష్ ఇద్దరు గెలవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



ఆంధ్రప్రదేశ్‌లో రాజక్కపేట వాసి మృతి

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 17: దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామానికి చెందిన కొరివి యాదగిరి(26) ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు తగిలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోనీ ప్రకాశం జిల్లా ఎఱ్ఱగొండ పాలెం వద్ద మృతిచెందాడు . గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కొద్ది రోజుల క్రితం వరి కోత మిషన్ డ్రైవర్ గా పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాకు వెళ్లినట్టు తెలిపారు.బుధవారం ఉదయం పని చేస్తున్న క్రమంలో జరిగిన ప్రమాదం లో ప్రాణాలు కోల్పోయినట్లు వారు తెలిపారు. ఈ ఘటనతో రాజక్కపేట గ్రామం లో విషాద ఛాయలు నెలకొన్నాయి.



సిద్దిపేట బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

- కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని పల్లె ప్రజల తీర్పు
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 17: సిద్దిపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఆదరణ పెరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిద్దిపేట అర్బన్ మండలం నాంచారుపల్లి గ్రామానికి చెందిన బీజేపీ పార్టీ సర్పంచ్ నర్సింహా రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. అదేవిధంగా చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు, ఓబులాపూర్ గ్రామాల నుంచి కాంగ్రెస్, బీజేపీ నాయకులు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు నాణేనికి బొమ్మ,బొరుసులని, ప్రజలను మోసం చేయడంలో రెండూ పోటీ పడుతున్నాయని విమర్శించారు. బీజేపీ చెప్పే సబ్కా సాత్ సబ్కా వికాస్ కాదని, అది సబ్కా బక్వాస్ మాత్రమేనన్నారు.గోధుమలకు ఎక్కువ మద్దతు ధర ఇచ్చి తెలంగాణ వరి రైతులను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా నష్టపరిచిందని, బీఆర్ఎస్ పార్లమెంట్లో బలంగా ఉంటే తెలంగాణకు న్యాయం జరిగేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, మహిళలకు రూ.55 వేల వరకు, వృద్ధులకు రూ.44 వేల వరకు బాకీలు ఉన్నాయన్నారు. సర్పంచ్ ఎన్నికల్లోనే కాంగ్రెస్, బీజేపీలు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయాయని, నమ్మకానికి విశ్వాసానికి ప్రతీక బీఆర్ఎస్, కేసీఆర్ అని హరీష్ రావు తెలిపారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రానుందని పల్లె ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు.ఈ కార్యక్రమంలో నాంచారుపల్లి సర్పంచ్ పురుమాండ్ల నర్సింహా రెడ్డి, వార్డు సభ్యులు, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో లక్కీ డ్రా ద్వారా ఉపసర్పంచ్ ఎన్నిక



ప్రతిపక్షం, కొమురవెల్లి, డిసెంబర్ 17: కొమురవెల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కొమురవెల్లి గ్రామ ఉపసర్పంచ్ ని అధికారులు లక్కీ డ్రా ద్వారా ఎన్నిక చేయడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది. బుధవారం కొమురవెల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో 12 మంది వార్డు సభ్యులు గెలుపొందారు. కొమురవెల్లి ఉపసర్పంచ్ ఎన్నికకు నాలుగు సభ్యులు మహాదేవుని శశిధర్, పోతుగంటి శ్రీనివాస్, ఎక్కలదేవి మహేష్, కడమంచి కనకయ్యలు పోటీ పడగా నాలుగురు సభ్యులకు మిగతా ఎనిమిది మంది సభ్యులు ఒక్కొక్కరికి ఇద్దరు చొప్పున మద్దతు పలుకగా ఎవరికీ సరైన మెజారిటీ రాకపోవడంతో నిలబడిన నలుగురు సభ్యుల పేర్లు రాసి లక్కీడ్రా తీసి నాలుగురు సభ్యులు పేర్లు రాసి డ్రా తీయగా పోతుగంటి శ్రీనివాస్ పేరు లక్కీ డ్రాలో పేరు రావడంతో అధికారులు పోతుగంటి శ్రీనివాస్ ను కొమురవెల్లి ఉపసర్పంచ్ గా నియమిస్తూ ధ్రువీకరణ పత్రం అందజేశారు. కొమురవెల్లి ఉపసర్పంచ్ గా పోతుగంటి శ్రీనివాస్ ఎన్నిక కావడంపై స్థానికులు మిగతా వార్డు సభ్యులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా ముగిసిన మెదక్ గ్రామపంచాయితీ ఎన్నికలు

- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు



ప్రతిపక్షం,ప్రతినిధి,మెదక్ డిసెంబర్ 17: జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలు అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగిశాయని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు బుధవారం సాయంత్రం ప్రకటించారు. ఈ నెల 11 నుంచి 17 వరకు జరిగిన ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రజలు, పోలీసు అధికారులు, ఇతర శాఖల సిబ్బందికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఎన్నికల నిర్వహణకు మొత్తం 750 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. ఎన్నికల తేదీల నుండి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిబంధనలను కఠినంగా అమలు చేసినట్లు, ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, భయభ్రాంతులకు గురికాకుండా నిరంతర నిఘా కొనసాగించామని వివరించారు. జిల్లాలో విస్తృత తనిఖీల ద్వారా ఇప్పటి వరకు రూ.47,48,000 నగదు, 268 కేసుల్లో సుమారు రూ.26,46,968 విలువ గల 3,688 లీటర్లు మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా, రూ.27,36,000 విలువ గల 673 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మొత్తం విలువగా రూ.1 కోటి 1 లక్ష 32 వేల రూపాయలు లభ్యమైందని ఎస్పీ తెలిపారు.గత ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి ముందస్తుగా 1,122 మందిని బైండోవర్ చేయడం జరిగిందని కూడా చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు సిబ్బంది చలి, పగలు, రాత్రి లెక్కించకుండా కష్టపడి విధులు నిర్వర్తించారని ప్రశంసించారు. ఎన్నికలు ఇంత ప్రశాంతంగా జరగడంలో కీలక పాత్ర పోషించిన ప్రతి ఒక్కరికి ఎస్పీ అభినందనలు తెలిపారు.



సుంకాలు, ఇతర చర్యలతో ప్రపంచ వాణిజ్యం ఆయుధంలా మారుతోంది. భారత్ జాగ్రత్తగా సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఉంది. మన ఆర్థిక వ్యవస్థ బలమే మనకు అదనపు ప్రయోజనం ఇస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యం స్వేచ్ఛగా, న్యాయంగా లేదు. ఇండియాను టారిఫ్ కింగ్ అని, ఇప్పుడు టారిఫ్‌లనే ఆయుధాలుగా వాడుతున్నారు.

- అమెరికా, మెక్సికో టారిఫ్‌లపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

మన భాగస్వామ్యం పటిష్టం

- ఇథియోపియా పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 17: ఇథియోపియా పార్లమెంటు సంయుక్త సమావేశంలో బుధవారం ప్రధానమంత్రి మోదీ ప్రసంగించారు. ఇథియోపియాలోని సామాన్యులు రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, గర్వించేలా ఎదుగుతున్న మహిళలు, దేశ భవితను తీర్చిదిద్దుతున్న యువతతో ఈ ప్రజాస్వామ్య దేవాలయం నుంచి మాట్లాడడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. అత్యున్నత పురస్కారం 'గ్రేట్ ఆనర్ ఆఫ్ ఇథియోపియా నిషాన్'ను తనకు అందించిన ఇథియోపియా ప్రజలకు, ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇరు దేశాల మధ్య ఉన్న చిరకాల సంబంధాలు ఈ పర్యటన సందర్భంగా వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి ఎదగడం పట్ల ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేశారు. భారత్, ఇథియోపియా మధ్య నాగరికతా సంబంధాలను గుర్తుచేస్తూ.. ఇరు దేశాలు ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునిక ఆశయాలతో మేళవించాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే, భారత జాతీయ గేయం 'వందేమాతరం', ఇథియోపియా జాతీయ గీతం రెండూ తమ దేశాన్ని తల్లిగా వర్ణిస్తాయని ఆయన చెప్పారు. భారత్, ఇథియోపియా భాగస్వామ్యాన్ని మెరుగుపరచుకోవడంతోపాటు మరింత పటిష్టం చేసుకునేందుకు భారత్ కట్టుబడి ఉందని ప్రధానమంత్రి తెలిపారు. ఈ విషయంలో ఇథియోపియా వికాసం, శ్రేయస్సు కోసం భారతీయ ఉపాధ్యాయులు, వ్యాపార సంస్థల సహకారాన్ని ఆయన గుర్తు చేశారు. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, ఆహార శుద్ధి, సృజనాత్మక రంగాలు సహా భారత అభివృద్ధి అనుభవాలను ఆయన వివరించారు. ఇథియోపియా ప్రాధమ్యాలకు అనుగుణంగా ఆ దేశానికి అభివృద్ధిపరంగా చేయూతను కొనసాగించడానికి భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. 'వసుధైవ కుటుంబకం' అనే సూత్రంలో వివరించినట్టుగా.. సర్వ మానవాళి సేవకూ భారత్ కట్టుబడి ఉందని చెబుతూ.. కోవిడ్ విపత్తు సమయంలో ఇథియోపియాకు వ్యాక్సిన్లను సరఫరా చేయడం భారత్‌కు దక్కిన గౌరవమన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ భవితను తామే లిఖించుకుంటున్నాయన్నారు.



విశ్వ వీక్షణం



సీవోపీడీ, అస్తమా ఒకటేనా?


డా. కౌశల్ గోవర్ధన
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
డా. ధనుంజయ నర్సింగ్ హోమ్
7702417779

దగ్గు, శ్వాసలో ఇబ్బంది, ఛాతీ బిగపట్టినట్ట్ అనిపించడం లాంటి లక్షణాలు కనిపిస్తే చాలా మంది దీనికి ఆస్తమా అనుకుంటారు. ఇవే లక్షణాలతో సీవోపీడీ అనే దీర్ఘకాలిక సమస్య కావచ్చు. మరి ఆస్తమాకి, సీవోపీడీకి మధ్య తేడాలు ఏంటి..? దానికి ఎలా గుర్తించాలి? తెలుసుకుందాం

ఎలా గుర్తించాలి

సీఓపీడీలో శ్వాసలోపం, నిరంతర దగ్గు (శ్లేష్మంతో కూడినది), గురక, ఛాతీ బిగుతు, అలసట వంటివి ఉంటాయి. ఇది నెమ్మదిగా పెరుగుతుంది. ముఖ్యంగా ధూమపానం వల్ల వస్తుంది. రోజువారీ పనులు కష్టతరం చేస్తుంది.

సీఓపీడీ లక్షణాలు

శారీరక శ్రమతో పాటు, సాధారణ పనులు చేసేటప్పుడు కూడా శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. శ్లేష్మంతో కూడిన దగ్గు, దీనిని "స్మోకర్స్ కాఫ్" అని కూడా అంటారు. ఊపిరి పీల్చుకున్నప్పుడు గురక శబ్దం. ఊపిరి తీసుకోవడానికి కష్టంగా అనిపిస్తుంది. నిరంతర అలసట ఉంటాయి. వ్యాధి పెరుగుతున్న కొద్దీ రోజువారీ కార్యకలాపాలు కష్టమవుతాయి.

ఆస్తమాలో

ప్రధానంగా శ్వాసలో ఈల శబ్దం, ఛాతీ బిగుతు, దగ్గు, శ్వాస ఆడకపోవడం వంటివి ఉంటాయి, ఇవి తరచుగా రాత్రి లేదా ఉదయం ఎక్కువవుతాయి. ముఖ్యంగా అలర్జీల వల్ల వస్తాయి.

రెండు వ్యాధులకు ముఖ్యమైన తేడా

కొందరు సీవోపీడీని ఆస్థమాగా పొరపడుతుంటారు. ఇవి రెండూ వేర్వేరు సమస్యలు. ఆస్థమా ఎవరికైనా రావొచ్చు. ఇది చిన్నప్పుడే మొదలవుతుంది. కాలాల వారీగా ఉధృతమవుతుంది. దగ్గు, ఆయాసం, పిల్లికూతలతో పాటు ముక్కు బిగుసుకోవటం, కళ్లలోంచి నీరు, దురద, చర్మం మీద దద్దు వంటి అలర్జీ లక్షణాలూ ఉంటాయి. అదే సీవోపీడీ చాలావరకూ పొగ తాగేవారికి, పెద్దవారికి వస్తుంది. ఆస్తమా తరచుగా అలర్జీలతో సంబంధం కలిగి ఉంటుంది, మరియు సరైన చికిత్సతో లక్షణాలు తగ్గుముఖం పడతాయి.

సీఓపీడీ అంటే..


ప్రధానంగా ధూమపానం వల్ల వస్తుంది, మరియు నెమ్మదిగా పెరుగుతుంది. ఇది పొగచూరడం లాంటి ఏవో అడ్డంకులతో, ఊపిరితిత్తుల్లో వచ్చే సమస్యతో, దీర్ఘకాలం పాటు కొనసాగుతూ బాధితుల్ని వేధించే జబ్బు అని వ్యాధి పేరును బట్టి తెలుస్తుంది. దగ్గు, ఆయాసంతో వ్యక్తమయ్యే ఈ సమస్య ప్రధానంగా పెద్దవారినే వేధిస్తుంది. అయితే కొన్ని ప్రత్యేక (జన్యు) కారణాలతో చిన్న వయసువారిలో కూడా కనిపించవచ్చు. పొగతాగే అలవాటుతో పురుషుల్లో, ఇంకా కట్టెల పొయ్యి మీద వంటలు చేస్తూ ఉంటే... ఈ కారణంగా మహిళల్లో ఈ జబ్బు కనిపించే అవకాశాలెక్కువ. అసలే దగ్గుతో ఊపిరి సలపనివ్వని ఈ సమస్య, చలి కాలంలోని చల్లటి వాతావరణానికి మరింత పెచ్చరిల్లే అవకాశం ఉంది. దీని పేరే క్రానిక్ అబ్జెక్టివ్ పల్మనరీ డిసీజ్.

దగ్గు ప్రధానంగా లక్షణంగా వ్యక్తమయ్యే సీవోపీడీ సమస్య పెద్దల్లో... అందునా 40 ఏళ్లు దాటినవారిలో ఎక్కువగా కనిపిస్తుంది. సిగరెట్లూ, బీడీలూ, చుట్టలూ, హుక్కా కాల్చే వారిలో ఇది మరింత ఎక్కువగా కనిపిస్తుంది. వాతావరణ కాలుష్యాల్లో ఉండే దుమ్మూ, ధూళితో పాటు బొగ్గుగనులు, సిమెంట్, టెక్స్టైల్స్, రసాయనాల కాలుష్యం వెలువడే స్థలం దగ్గర ఉండేవారిలోనూ, ఆభరణాలకు ఆభరణాలకు పూతపూసే ఎలక్ట్రోప్లేటింగ్ వంటి కార్ఖానాల్లో పనిచేసే వారిలో కూడా ఇది ఎక్కువ.

సీవోపీడీ లక్షణాలు.. తీవ్రత

సీవోపీడీలో దగ్గు, ఆయాసాలు ప్రధాన లక్షణాలు. అయితే తీవ్రతను బట్టి ఇతరత్రా లక్షణాలు కూడా కనిపిస్తాయి. అలా తీవ్రతను బట్టి ఈ వ్యాధిని నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి... గోల్డ్ 1 (మైల్డ్), గోల్డ్ 2 (మోడరేట్), గోల్డ్ 3 (సివియర్), గోల్డ్ 4 (వెరీ సివియర్). ఇక్కడ గోల్డ్ అనేది 'గ్లోబల్ అబ్జెక్టివ్ లంగ్ డిసీజ్' అనే సంస్థకు సంక్షిప్త రూపం. 'గోల్డ్' సంస్థ... సీవోపీడీ మీద పరిశోధనలు చేస్తూ పల్మనాలజిస్టులకు (ఛాతీ వైద్యులకు)ఎప్పటికప్పుడు సూచనలు అందజేస్తుంది.

సీవోపీడీ అనగానే కేవలం ఊపిరితిత్తుల సమస్య అనే అనుకుంటాం. కానీ బాధితులలో వివిధ అవయవాలకు సంబంధించిన ఇతర సమస్యలూ ఎక్కువే ఉంటాయి. ఉదాహరణకు... ఆస్టియో పోరోసిస్, హార్ట్ ఫెయిల్యూర్, డయాబెటిస్, కిడ్నీ ఫెయిల్యూర్, కార్పెల్ పల్మొనాలె... మొదలైన సమస్యలతో ఇది కలిసి ఉంటుంది. అందువల్ల ఈ లక్షణాలను గుర్తిస్తూ, చికిత్స అందించాల్సి ఉంటుంది,



దీనినే 'సిందమిక్ అప్రోచ్' అంటారు. పోయిన సంవత్సరం (2024)కు సంబంధించిన కొత్త చికిత్స మార్గదర్శకాలను 'గోల్డ్' సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చింది.

వ్యాధి నిర్ధారణ ఎలా చేస్తారు ..

స్పైరోమీటర్ అనే పరికరం సహాయంతో సీవోపీడీని నిర్ధారణ చేస్తారు. దీనితో కొన్ని శ్వాస పరీక్షలు చేసి, సమస్య తీవ్రత ఎంతో తెలుసుకుంటారు. అంటే మైల్డ్, మోడరేట్ లేదా సమస్య తీవ్రం (సివియర్)గా ఉందా అని తెలుసుకుంటారు. ఈ పరీక్షకు ముందరే... బాధితులను వ్యక్తిగతంగా / క్లినికల్ గా పరీక్షించడంతో వైద్యులకు కొంత అవగాహన వస్తుంది. ఇలా చేసే పరీక్షల్లో బాధితుల వృత్తి వివరాలూ (ప్రొఫెషనల్ హజార్డ్స్), వారు పనిచేసే చోటు, వారుండే చోట కాలుష్య ప్రభావాలూ, పొగతాగడంలాంటి వారి అలవాట్లు... ఇవన్నీ వ్యాధి నిర్ధారణకు తోడ్పడతాయి. ఐఓఎస్ అనే పరికరం ప్రారంభ దశలో ఉన్న సీవోపీడీని గుర్తించడానికి ఉపయోగపడుతుంది.

ఐఓఎస్ అంటే

ఇంపల్స్ ఆసిల్లోమెట్రీ ఊపిరితిత్తుల దృఢత్వాన్ని కొలవడానికి ధ్వని తరంగాలను ఉపయోగిస్తుంది. ఈ పరీక్ష చాలా త్వరగా (30 సెకన్లు) జరుగుతుంది, రోగి నుండి ఎటువంటి ప్రయత్నం అవసరం లేదు మరియు రోగి వారి సాధారణ పద్ధతిలో శ్వాస తీసుకోవడం మాత్రమే అవసరం.

అపోహలు.. -వాస్తవం

ఈ వ్యాధి ఉన్నవారు ఎడతెరిపి లేకుండా దగ్గుతూ ఉంటారు. దాంతో ఇదో అంటువ్యాధిలా అనిపిస్తుంది గానీ, నిజానికి ఇది అంటువ్యాధి కానే కాదు. చికిత్స.. పేరులో దీర్ఘకాలిక సమస్య అని చెప్పే ఈ వ్యాధికి చికిత్స కూడా దీర్ఘకాలికంగానే అవసరమవుతుంది. మీకు సీవోపీడీ లక్షణాలు కనిపించినప్పుడు దగ్గు కొద్దిగా ఉన్నప్పుడే మీ వ్యక్తిగత వైద్యుని సంప్రదించాలి. లక్షణాలు పెరిగేదాకా ఆగడం లాంటి నిర్లక్ష్యం చేయకూడదు. చికిత్స ఎంత త్వరగా జరిగితే ఫలితాలు అంత బాగుంటాయి, సీవోపీడీని అంత తేలిగ్గా/సమర్థంగా అదుపు చేయవచ్చు...

ఆస్తమా అంటే

ఊపిరి పీల్చుకున్నప్పుడు ఈల వేసినట్లు శబ్దం వస్తుంది. ముఖ్యంగా రాత్రి లేదా ఉదయం సమయంలో తీవ్రంగా ఉంటుంది, పొడి దగ్గు లేదా శ్లేష్మంతో కూడిన దగ్గు వస్తుంది. శ్వాస తీసుకోవడం కష్టంగా అనిపిస్తుంది. ఛాతీపై ఏదో బరువు పెట్టినట్లు లేదా బిగుతుగా అనిపిస్తుంది. అదనపు శ్లేష్మం ఉత్పత్తి అవుతుంది. తీవ్రమైన దగ్గు, జలుబుతో ఊపిరాడనివ్వకుండా ఇబ్బంది పెట్టే వ్యాధి. ఆధునిక జీవన శైలి, వాయు కాలుష్యం కారణంగా ఆస్తమా కేసులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ దీని బారిన పడుతున్నారు. ప్రపంచ జనాభాలో సుమారు 30 కోట్లకు పైగా జనాభా ఆస్తమాతో బాధపడుతున్నారు. మన దేశ జనాభాలో 3 శాతానికి పైగా పెద్దలు, 6 శాతానికి పైగా పిల్లలు ఆస్తమా వ్యాధితో బాధపడుతున్నారని వైద్య నివేదికలు చెబుతున్నాయి. అయితే ముందుగానే మేల్కొని తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆస్తమాను పూర్తిగా తగ్గించవచ్చు..

ఊపిరితిత్తుల్లో సమస్య

ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో పెరుగుతున్న కాలుష్యం, పట్టణీకరణ వంటి అనేక అంశాలు ఆస్తమా బారినపడటానికి కారణం అమవుతున్నాయి. ఆస్తమా ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి. దీని బారినపడిన వారిలో ఛాతి బిగుతుకావడం తోపాటు ఊపిరితిత్తులు మూసుకుపోతాయి. దీంతో తీవ్రమైన దగ్గు, శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. ఈ వ్యాధి ఎక్కువగా శీతాకాలంలో ప్రభావం చూపుతుంది. ఆయాసం, దగ్గు వంటి లక్షణాలతో ఇది ప్రారంభమవుతుంది. ఈ ఆస్తమా వ్యాధి వంశపారంపర్యంగా ఒకరి నుంచి మరొకరికి వచ్చే అవకాశం ఉన్నది.

ఆస్తమా రావడానికి గల కారణాలు

వాతావరణంలో మార్పులు, పొగ, దుమ్ముతో నిండిన పరికరాలు, బాడీ స్ప్రేలు, అగరబత్తీల పరిమళాలు, దోమల నివారణకు వాడే కాయిల్స్, పెంపుడు జంతువులు, టపాసుల వల్ల వచ్చే పొగ, పూల పుప్పొడి

ఆస్తమా లక్షణాలు

ఆయాసము ప్రధాన లక్షణం, పిల్లికూతలు, దగ్గు, ఛాతి బరువుగా ఉండటం, జలుబు, తుమ్ములు రావడం, ముక్కు నుంచి నీరు రావడం, జన్యు సంబంధిత కారణాలు, చలి కాలంలో ఆయాసము ఎక్కువ

అస్తమాకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ధూమపానానికి దూరంగా ఉండటం, దుమ్ము, ధూళికి దూరంగా ఉండటం, శీతల పానీయాలు, ఐస్‌క్రీమ్‌లు, ఫ్రిజ్ వాటర్ వంటి చల్లని పదార్థాలు తీసుకోకుండా ఉండటం, ఇంట్లో బూజు దూలపడము వంటివి చేయకూడదు, ఇన్ హేలర్ కలిగి ఉండటం చాలా ముఖ్యం.

అపోహలు.. -వాస్తవం

ఆయాసం లేనప్పుడు కూడా మందులు వాడాలా?
ఆస్తమా దీర్ఘకాలిక సమస్య. ఆయాసం అప్పుడప్పుడు వస్తూ తగ్గుతుండవచ్చు. కాలం గడిచేకొద్ది శ్వాసనాళాల్లో శాశ్వతమైన మార్పులు వస్తాయి. ఈ మార్పులను నిరోధించాలంటే క్రమం తప్పకుండా వైద్యులు సూచించిన విధంగా మందులు వాడుకోవాలి.

పిల్లల వయసు పెరిగే కొద్దీ ఆస్తమా తగ్గుతుందా?
ి ముగ్గురిలో ఇద్దరికి తగ్గే అవకాశము ఉంది. అయితే చిన్నతనంలో వచ్చే ఆస్తమా ఎటాక్‌లను నివారించడానికి, నయం చేయడానికి తగిన వైద్యం చేయించుకుంటే పెద్ద అయిన తర్వాత కూడా ఈ సమస్య వెంటాడొచ్చు. కాబట్టి చిన్న వయసులో వచ్చే ఆస్తమాకు తప్పనిసరిగా వైద్యం చేయించుకోవాలి.

ఆస్తమా ఉన్న పిల్లలు సాధారణ జీవితం గడపగలరా? పెరుగుదల ఉంటుందా?
ఆస్తమా నియంత్రణలో ఉన్న పిల్లవాడు సాధారణమైన జీవితాన్ని గడుపుతున్నట్లే భావించాలి. పెరుగుదలలో కూడా ఏమి తేడా ఉండదు.

ఆస్తమా నయం కాదా?
ఆస్తమా ఒక ఇన్‌ఫ్లమేటరీ జబ్బు. ఇన్‌ఫ్లమేషన్ అనేది శరీరంలో ఒక్క సహజమైన రక్షణ గుణం. ఇది ఎక్కువ కావడం, తక్కువ కావడము ఉంటుంది. అంటే బాగా నియంత్రించవచ్చు.

ఆస్తమాకు వ్యాక్సిన్ ఉందా?
ఆస్తమాకు వ్యాక్సిన్ లేదు. కానీ ఫ్లూ వల్ల ఆస్తమా ఎక్కువ అవుతుంది. ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఫ్లూ ఎక్కువగా వస్తుంది కాబట్టి ఫ్లూ వ్యాక్సిన్ వాడితే కాస్త ఉపశమనం ఉంటుంది.

యోగాతో ఆస్తమాకు తగ్గుతుందా ?
ఆస్తమాకు యోగా, ప్రాణాయామము మంచి వ్యాయామాలు. వృద్ధులు, ఊబకాయం ఉన్నవాళ్లు, ఆస్తమా తొలి దశలో ఉన్న వ్యక్తులు బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు, ప్రాణాయామం చేయడం వల్ల ఉపయోగం ఉంటుంది. శ్వాసను లోతుగా తీసుకొని దాన్ని పట్టి ఉంచడం, తర్వాత నెమ్మదిగా వదలడం వంటి ట్రిక్స్ ఆస్తమా ఎటాక్‌ను కొంతవరకు తగ్గిస్తాయి.

ఆస్తమాను పూర్తిగా నయం చేయడం సాధ్యం కాదు. దానిని నియంత్రించడం మాత్రమే సాధ్యమవుతుంది. జన్యుపరమైన, పర్యావరణ కారణాల వల్ల ఈ వ్యాధికి శాశ్వత నివారణ లేదు. ఆస్తమాను పూర్తిగా నయం చేసే వైద్య చికిత్స లేదు. ఒక వ్యక్తిలో ఆస్తమా దాడి అతని రోగనిరోధక వ్యవస్థ వల్ల కూడా వస్తుంది. ఈ రకమైన సమస్యకు శాశ్వత చికిత్స కష్టం అవుతుంది. అందుకే ఆస్తమాకు మందు లేదు. అయితే ఇది ఆందోళన చెందాల్సిన విషయం కాదు. మంచి జీవనశైలి, మంచి ఆహారం, వైద్యుని సలహా మేరకు ఇన్‌హేలర్ వాడకం ద్వారా ఈ వ్యాధిని సులభంగా నియంత్రించవచ్చు.



దేశంలో చిరు వ్యాపారులను పట్టించుకోవడం లేదు

- కేంద్రం వైఖరిని తప్పు పట్టిన రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 17: జర్మనీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటన బిజీబిజీగా సాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా మ్యూనిచ్‌లోని బీఎండబ్ల్యూ ప్లాంట్‌ను రాహుల్ గాంధీ సందర్శించారు. అందులోని తాజా మోడల్ కార్లు, ఎలక్ట్రిక్ బైక్‌లు.. ఎం సిరీస్, బీఎండబ్ల్యూ ఐఎస్3, రూల్స్ రాయిస్ తదితర వాహనాలను ఆయన పరిశీలించారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తయారీ రంగంపై దృష్టి పెట్టాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. దేశంలో చిరు వ్యాపారులను పట్టించుకోవడం లేదంటూ కేంద్ర వైఖరిని తప్పుపట్టారు. ఈ సందర్భంగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక వీడియోను పోస్ట్ చేసి ఆయన.. కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీఎస్ 450 సీసీ మోటర్ సైకిల్‌ను బీఎండబ్ల్యూ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఇది భారతీయ ఇంజినీరింగ్ పనితనానికి గర్వకారణంగా ఉందన్నారు. తయారీ రంగం.. బలమైన ఆర్థికాభివృద్ధికి వెన్నుముక వంటిదని అభివర్ణించారు. కానీ విచారం ఏమింటే.. భారత్‌లో మాత్రం ఈ తయారీ రంగం అనేది తగ్గిపోతుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిని వేగవంతం చేయాలంటే.. మనం మరిన్ని ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. జర్మనీలో టీవీఎస్ 450సీసీ బైక్ చూసి చాలా సంతోషిస్తున్నానని, ఇది అద్భుతంగా ఉందని ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. జర్మనీ పర్యటనలో ఉన్న ఆయన.. మ్యూనిచ్‌లోని బీఎండబ్ల్యూ ప్లాంట్‌ను సందర్శించారు. ఆ సంస్థ సహకారంతో తయారు చేసిన టీవీఎస్ 450సీసీ బైక్ సహా లేటెస్ట్ మోడల్ కార్లు, రోల్స్ రాయిస్, ఇటాలియన్‌ప్రేరేపిత వింటేజ్ బీఎండబ్ల్యూ ఇసెట్టా, మ్యాక్సీ బైక్‌లను రాహుల్ పరిశీలించారు. అనంతరం అక్కడి సిబ్బందితో కాసేపు ముచ్చటించి.. కొత్త మోడల్స్ వివరాలు తెలుసుకున్నాడు. అనంతరం భారత తయారీ రంగం గురించి మాట్లాడుతూ.. మన దేశంలో ఉత్పత్తి మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.




తొలి మిస్ ఇండియా కన్నుమూత

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 17: తొలి మిస్ ఇండియా, ప్రఖ్యాత ఫ్యాషన్ జర్నలిస్ట్ మెహర్ కాస్టలినో (81) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బధవారం తుదిశ్వాస విడిచారు. ఆమెకు కుమారుడు కార్ల్, కోడలు నిషా, కుమార్తె క్రిస్టినా ఉన్నారు. ముంబైలో జన్మించిన మెహర్, 1964లో ఫెమీనా మిస్ ఇండియా కిరీటాన్ని గెలుచుకొని చరిత్ర సృష్టించారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె నిలిచారు. అనంతరం మిస్ యూనివర్స్, మిస్ యూనైటెడ్ నేషన్స్ వంటి అంతర్జాతీయ అందాల పోటీల్లో భారతదేశానికి ప్రాతినిథ్యం వహించారు. మోడలింగ్ తర్వాత ఫ్యాషన్ జర్నలిజంలోకి అడుగు పెట్టి తనదైన ముద్రవేశారు.




అణు రంగంలో 'ప్రైవేట్'కు అనుమతి

- బిల్లును అమోదించిన లోక్‌సభ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 17: అణు రంగంలో ప్రైవేట్ సంస్థల ప్రవేశానికి ముందడుగుపడింది. దీనికి అనుమతించే 'శాంతి' బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది. 2047 నాటికి దేశం 100 గిగా వాట్ల అణుశక్తి ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడంలో ఈ బిల్లు సహాయపడుతుందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సభకు తెలిపారు. అయితే పౌర అణు రంగాన్ని ప్రైవేట్ భాగస్వామ్యం కోసం తెరవడానికి ప్రయత్నిస్తున్న సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (శాంతి) బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. సభ నుంచి వాకౌట్ చేశాయి. అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందింది. కాగా, దేశ అభివృద్ధి ప్రయాణానికి కొత్త దిశానిర్దేశం చేసే మైలురాయి చట్టమని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అభివర్ణించారు. 'భౌగోళిక రాజకీయాల్లో భారత దేశం పాత్ర పెరుగుతున్నది. మనం ప్రపంచవ్యాప్త భాగస్వామిగా ఉండాలంటే, ప్రపంచ ప్రమాణాలు, ప్రపంచ వ్యూహాలను మనం అనుసరించాలి. ప్రపంచం స్వచ్ఛమైన శక్తి వైపు పయనిస్తోంది. మనం కూడా 2047 నాటికి 100 గిగా వాట్ల అణుశక్తి సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని అన్నారు. మరోవైపు 2010 అణు ప్రమాద పౌర బాధ్యత చట్టం నిబంధనలను ఈ బిల్లు బలహీనపరిచినట్లు ప్రతిపక్షం ఆరోపించింది. అణు పరికరాల సరఫరాదారులను ప్రమాదాల బాధ్యత నుంచి ఈ బిల్లు తప్పించినట్లు విమర్శించింది.







ఇండియా, సౌతాఫ్రికా నాలుగో టీ 20 రద్దు

- దట్టమైన పొగమంచే కారణం

భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరగాల్సిన నాలుగో టీ20 రద్దయింది. లక్నోలోని ఎక్‌నా స్టేడియాన్ని పొగమంచు కమ్మేయడంతో టాస్ వేయకుండానే మ్యాచ్‌ను నిలిపివేశారు అంపైర్లు. దాంతో.. సిరీస్‌లో ఇక్కడే పట్టేయాలనుకున్న టీమిండియా, సమం చేయాలనుకున్న సఫారీ జట్టు నిరాశకు లోనయ్యాయి. సుమారు 2 గంటలకు పైగా స్టేడియంలో పడిగాపులు కాసిన అభిమానులు ఉసూరుమన్నారు. ఇరుజట్ల మధ్య డిసెంబర్ 19న జరిగే ఐదో మ్యాచ్ విజేతను నిర్ణయించనుంది. స్వదేశంలో మరో పొట్టి సిరీస్ విజయంపై గురి పెట్టిన భారత జట్టుకు లక్నో వాతావరణం షాకిచ్చింది. టాస్‌కు ముందు నుంచే స్టేడియంలో దట్టంగా పరుచుకున్న పొగమంచు రెండు గంటలైనా అలానే ఉండిపోయింది. పలుమార్లు మైదానంలోపలికి వచ్చి లైటింగ్, ఫాగ్‌ను పరిశీలించిన అంపైర్లు చివరకు ఆట సాధ్యపడదనే నిర్ణయానికి వచ్చారు. రాత్రి 9:25 గంటలకు మరోసారి మైదానంలోకి వెళ్లిన అంపైర్లు .. పరిస్థితిలో ఏ మార్పు లేదని, ఇలాంటి వాతావరణంలో ఆట సాధ్యం కాదని ఇరుజట్ల కెప్టెన్లకు వివరించి మ్యాచ్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దాంతో.. లక్నోలో గెలిచి సిరీస్ సమం చేయాలనుకున్న దక్షిణాఫ్రికా ఆశలు ఆవిరయ్యాయి. డిసెంబర్ 19న అహ్మదాబాద్‌లో ఆ జట్టు గెలిస్తేనే సిరీస్ పంచుకోగలదు. ఒకవేళ టీమిండియానే విజయం సాధిస్తే.. 31తో ట్రోఫీని అందుకుంటుంది.

నల్లబ్యాడ్జీలతో మ్యాచ్‌కు ఆస్ట్రేలియా క్రికెటర్లు

- సిడ్నీ కాల్పుల మృతులకు సంతాపం

యాషెస్ సిరీస్ లో భాగంగా అడిలైడ్ వేదికగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య మూడో టెస్టు ప్రారంభమైంది. ఇరుజట్ల ప్లేయర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆటలో పాల్గొన్నారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన బోండీ బీచ్‌లో యూదుల హనుక్కా వేడుక లక్ష్యంగా ఇద్దరు దుండగలు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడి.. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ ఆటగాళ్లు చేతికి నల్ల బ్యాండ్లు ధరించారు. అలాగే స్టేడియంలోని ఇరు దేశాల జెండాలను సగం ఎత్తులోనే ఎగురవేశారు. సిడ్నీలో జరిగిన కాల్పుల ఘటన నేపథ్యంలో.. మూడో టెస్టు జరిగే ఆడిలైడ్ మైదానం లోపల, వెలుపల భద్రతను కట్టుదిట్టం చేశారు. బోండీ బీచ్ దుర్ఘటనపై ఇరు జట్ల ప్లేయర్లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంఘటనా స్థలానికి సమీపంలో నివసించే ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్.. జరిగిన దుర్ఘటన తనను భయాందోళనకు గురి చేసిందన్నాడు. బోండీ బీచ్ తన ఇంటికి చాలా దగ్గర్లోనే ఉంటుందని, తరచూ తన పిల్లలను అక్కడికి తీసుకువెళుతుంటానని కమిన్స్ తెలిపాడు. కాల్పుల ఘటనతో తాను భయాందోళనకు గురయ్యానని అతడు వాపోయాడు. క్రికెట్ ప్రపంచంలోని ప్రతిఒక్కరూ బోండీ బీచ్ బాధితులకు, వారి కుటుంబాలకు, స్నేహితులకు, యూదులకు మద్దతుగా ఉన్నారని క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ టాడ్ గ్రీన్‌బర్గ్ అన్నారు. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ మాట్లాడుతూ.. 'ఇది ఆస్ట్రేలియా, సిడ్నీ నగరంతో పాటు యావత్తు ప్రపంచానికి కూడా చాలా విచారకరం' అని అన్నాడు. ఇక ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా ప్లేయర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి మూడో టెస్టు ఆటడటంపై క్రికెట్ అభిమానులు ఫిదా అవుతున్నారు.



ఆరేళ్ల తర్వాత ఆట.. శిష్యుడితోనే పోటీ

ఒకప్పుడు చదరంగంలో రారాజుగా వెలుగొందిన విశ్వనాథన్ ఆనంద్ మళ్లీ పోటీకి సిద్ధమవుతున్నాడు. ఆరేళ్ల విరామం తర్వాత తొలి గేమ్‌తో అభిమానులను అలరించనున్నాడీ చెస్ దిగ్గజం. టాటా స్టీల్ చెస్ ఇండియా టోర్నీలో తన శిష్యుడైన డి.గుకేశ్‌తో ఆడనున్నాడు విషీ. వచ్చే ఏడాది జనవరిలో సొంతగడ్డపై జరుగబోయే ఈ మెగా ఈవెంట్ లో వీరిద్దరి పోరుపై ఇప్పటి నుంచే సర్వత్రా ఆసక్తి నెలకొంది. 2019 తర్వాత ఆనంద్ బరిలోకి దిగుతుండడంతో అతడిపై భారీ అంచనాలే ఉన్నాయి. వచ్చే ఏడాది ఆరంభంలో బెంగాల్‌లోని ధోనో ధ్యానో ఆడిటోరియంలో టాటా స్టీల్ చెస్ ఇండియా 2025 టోర్నీ జరుగనుంది. ఆనంద్ గుకేశ్‌తో పాటు పలువురు అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్లు పోటీపడనున్నారు. అయితే.. ఆరేళ్ల బ్రేక్ తర్వాత ఆనంద్ ఆడుతున్న మ్యాచ్‌పైనే అందరూ ఆసక్తిగా ఉన్నారు. 'స్వదేశంలో జరుగబోయే ఈ మెగా టోర్నీలో యువకెరటంతో ఆడేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా అని ఆనంద్ మీడియాతో' అన్నాడు. స్టీల్ చెస్ ఇండియా టోర్నీలో.. ఓపెన్, ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్లు నిర్వహిస్తారు. పురుషులు, మహిళల విభాగంలో పోటీలు జరుగనున్నందున.. రెండు కేటగిరీల విజేతలకు సమానమైన ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు. భారత్ నుంచి ఆర్.ప్రజ్ఞానంద, అర్జున్ ఎరిగేసి, విదిత్ గుజరాతీ, అరవింద్ చిదంబరం, దివ్య దేశ్‌ముఖ్, డి.హారిక, ఆర్ వైశాలి. వంతికా అగర్వాల్, రక్షిత రవిలు పోటీకి సిద్ధమవుతున్నారు. విదేశీయుల్లో వీ యీ, వెస్లీ సో, హన్స్ నీమన్, వొలోదర్ ముర్జిన్, అలెగ్జాండ్రా గొర్యచ్కినా, కేథిరినా లగ్నో, ననా జగ్‌నిడ్జేలు ఉన్నారు.



మోహన్ బగాన్ యేడాది పాటు నిషేధం

- దాంతో పాటు 91 లక్షల జరిమానా విధించిన ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య

అసలే తీవ్ర అనిశ్చితిలో కొనసాగుతున్న భారత ఫుట్ బాల్ రంగానికి మరో దెబ్బ. దేశ దిగ్గజ ఫుట్ బాల్ క్లబ్ అయిన మోహన్ బగాన్ సూపర్ జెయింట్స్‌కు ఆసియా ఫుట్ బాల్ సమాఖ్య (ఏఎఫ్‌సీ) షాకిచ్చింది. 202526 ఏఎఫ్‌సీ చాంపియన్స్ లీగ్ 2లో భాగంగా ఇరాన్‌తో మ్యాచ్ ఆడకుండా విరమించుకున్నందుకు గాను ఆ జట్టుపై ఏడాదిపాటు నిషేధం విధించింది. బ్యాన్‌తో పాటు రూ. 91 లక్షల జరిమానా చెల్లించాల్సిందిగా ఆదేశించింది. ఏఎఫ్‌సీ చాంపియన్స్ లీగ్‌లో మోహన్ బగాన్.. ఇరాన్‌కు చెందిన సెపహాన్‌తో మ్యాచ్ ఆడాల్సి ఉన్నప్పటికీ ఆఖరి నిమిషంలో తాము ఇరాన్‌కు వెళ్లబోమని (ఆ జట్టుకు చెందిన ఆరుగురు ఆటగాళ్లకు ఇరాన్‌కు వెళ్లలేమని తేల్చి చెప్పడంతో) నిశ్చయించుకుంది. దీనిపై సెపహాన్ ఫిర్యాదుతో ఏఎఫ్‌సీ చర్యలకు ఉపక్రమించింది. అంతేగాక ఏఎఫ్‌సీ ఆసియా కప్ 2027 ఫైనల్ రౌండ్ క్వాలిఫయర్స్‌ను నిర్ణీత సమయంలో నిర్వహించనందుకు గాను ఆలిండియా ఫుట్ బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) పైనా రూ. 90 వేల జరిమానా విధించింది.

ప్రతిపక్షం
www.prathipaksham.in



ఏఎన్ఆర్ కళాశాల కోసం 2 కోట్ల స్కాలర్‌షిప్ ఫండ్

అనౌన్స్ చేసిన నాగార్జున అక్కినేని

కింగ్ నాగార్జున అక్కినేని కృష్ణా జిల్లా గుడివాడలోని ఏఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులు, సిబ్బంది, హాజరైన వారందరికీ ఒక చిరస్మరణీయ క్షణాన్ని అందించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ,.. తన తల్లిదండ్రులైన అక్కినేని నాగేశ్వరరావు, అన్నపూర్ణ అక్కినేని జ్ఞాపకార్థం అక్కినేని కుటుంబం ఏఎన్ఆర్ కళాశాలలో 2 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్ నిధిని ఏర్పాటు చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. ఈ నిర్ణయం తాను, తన సోదరి సుశీల, సోదరుడు వెంకట్, మొత్తం ఏఎన్ఆర్ కుటుంబం కలిసి తీసుకున్నట్లు తెలిపారు. "ఈ నిధిని సరైన పద్ధతిలో అమలు చేయడానికి మేము ఏఎన్ఆర్ కళాశాల యాజమాన్యంతో కలిసి పని చేస్తాము. సంవత్సరాల క్రితం మా నాన్నగారు ఈ సంస్థకు లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు, ఆయన వారసత్వాన్ని కొనసాగించడం మా బాధ్యత. ఈ ప్రకటనకు విద్యార్థులు, అధ్యాపకుల నుంచి కరతాళ ధ్వనులు లభించాయి. ఇది కేవలం కుటుంబం యొక్క ఉదారతను మాత్రమే కాకుండా, విద్య, సమాజ సేవతో వారికి ఉన్న శాశ్వత అనుబంధాన్ని కూడా చాటింది.



జేమ్స్ కామెరాన్, ఎస్ఎస్ రాజమౌళి సంభాషణ

అవతార్: ఫైర్ అండ్ ఆష్ పై ఉత్సాహం

ప్రపంచ సినిమా దిగ్గజులు జేమ్స్ కామెరాన్, ఎస్ఎస్ రాజమౌళి కలిసి అవతార్ ఫ్రాంచైజీలో రాబోయే చిత్రం అవతార్: ఫైర్ అండ్ ఆష్ గురించి చర్చించారు. ఈ సంభాషణలో భారీ స్థాయి కథనాలు, సృజనాత్మక ప్రక్రియలు, చిత్ర విడుదల సమయంలో వచ్చే ఆందోళనల గురించి బహిరంగంగా మాట్లాడారు. అవతార్: ఫైర్ అండ్ ఆష్ చూసినప్పుడు రాజమౌళి "థియేటర్‌లో పిల్లవాడిలా చూస్తుండిపోయాను" అని వ్యాఖ్యానించారు. కామెరాన్ సినిమాటిక్ స్పెక్టాకిల్‌ను మరింత అభివృద్ధి చేస్తూనే భావోద్వేగాలను కేంద్రంగా ఉంచడాన్ని ప్రశంసించారు. హైదరాబాద్‌లో అవతార్ ఐమాక్స్‌లో ఏడాది పాటు ప్రదర్శించబడిందని రాజమౌళి పేర్కొన్నారు. అవతార్ ఫ్రాంచైజీ ఇమ్మర్సివ్ బిగ్ స్క్రీన్ అనుభవాలకు బెంచ్‌మార్క్‌గా ఉందని ఆయన అన్నారు. కామెరాన్ కూడా రాజమౌళి సినిమాటిక్ విజన్‌ను అభినందించి, భారతీయ దర్శకుడి ఫిల్మ్ సెట్‌ను సందర్శించాలని కోరిక వ్యక్తం చేశారు. 20th సెంచరీ స్టూడియోస్ నుంచి అవతార్: ఫైర్ అండ్ ఆష్ డిసెంబర్ 19న భారతదేశంలో 6 భాషల్లో (ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ) విడుదల కానుంది.

తెలుగులో చేయడం ఆనందంగా ఉంది

హీరోయిన్ అనస్వర రాజన్

స్వప్న సినిమాస్ అప్ కమింగ్ మూవీ 'ఛాంపియన్' ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణ లో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. మిక్కీ జే మేయర్ అందించిన పాటలు చార్ట్ బస్టర్ అయ్యాయి. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనస్వర రాజన్ విలేకరలు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

స్వప్న సినిమాస్ లాంటి ప్రతిష్టాత్మక బ్యానర్ లో ఛాంపియన్ సినిమాతో తెలుగులో లాంచ్ కావడం ఎలా అనిపిస్తోంది?

వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ లాంటి గొప్ప సంస్థ చేస్తున్న సినిమాతో తెలుగుకి రావడం అదృష్టంగా భావిస్తున్నాను. నాకు తెలుగు స్పష్టంగా రాదు. అయినప్పటికీ నన్ను ఎంతో సపోర్ట్ చేశారు. నా పట్ల ఎంతో కేర్ తీసుకున్నారు. వారి నిర్మాణంలో నా తొలి తెలుగు సినిమా రావడం ఎంతో ఆనందంగా వుంది.

టీజర్ లో మీరు చెప్పిన డైలాగ్స్ చాలా ఆకట్టుకున్నాయి.. తెలుగు డైలాగ్స్ చెప్పడం గురించి?

నిజానికి తెలుగు భాష మీద నాకు పెద్ద అవగాహన లేదు. అయితే డైరెక్టర్ ప్రదీప్ అలాగే యూనిట్లో అందరూ కూడా నాకు భాష విషయంలో ఎంతగానో సపోర్ట్ చేశారు. వాళ్ల సపోర్ట్ తోనే నేను తెలుగులో డైలాగ్స్ అంత చక్కగా పలకగలిగాను. డైరెక్టర్ గారు ప్రతి పదాన్ని చక్కగా నేర్పేవారు. నేను భాషను పలికిన విధానం ఆడియన్స్ కి కూడా నచ్చుతుందని భావిస్తున్నాను.

తెలుగు ఇండస్ట్రీలో పనిచేయడం ఎలా అనిపించింది

తెలుగు సినిమాలో ప్రతిదీ చాలా గ్రాండ్ గా ఉంటుంది. ఇక్కడ ఫిలిం మేకర్స్, ప్రొడ్యూసర్స్ చాలా సపోర్ట్ గా ఉంటారు. ఒక్కసారి ఇక్కడ పనిచేస్తే మళ్లీమళ్లీ తెలుగు సినిమాలే చేయాలనిపిస్తుంది. ఇక్కడ చాలా పెద్ద కాన్వాస్ లో సినిమాలు తీయడం నాకు చాలా నచ్చింది

గిరగిర సాంగ్ కి వచ్చిన రెస్పాన్స్ ఎలా అనిపించింది?

గిరగిరా సాంగ్ కి వచ్చిన రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. నాకు పర్సనల్ గా సాంగ్ చాలా ఇష్టం. మా ఫ్రెండ్స్ కి కూడా ఆ పాటంటే



చాలా ఇష్టం. ఈ పాట షూటింగ్ కూడా చాలా ఎంజాయ్ చేసాము . రోషన్ అద్భుతమైన డాన్సర్. తన నుంచి కొన్ని డాన్సింగ్ మెలకువలు కూడా నేర్చుకున్నాను.

స్వప్న సపోర్టు ఎలా ఉంది?

స్వప్న నుంచి నాకు చాలా సపోర్టు లభించింది. నేను సెట్ లో ఏదైనా చేస్తుంటే స్వప్న ఇచ్చే అప్లాజ్ నాకు మరింత ఎనర్జీ ఇచ్చింది. స్వప్న నాకు ఒక బిగ్ సిస్టర్ లా అనిపించారు.

ఈ కథ విన్నప్పుడు మీకు ఏమనిపించింది?

ఈ కథ విన్నప్పుడు నాకు చాలా ఎమోషనల్ గా అనిపించింది. ఇలాంటి కథ ప్రేక్షకుల మనసులో ఎప్పటికీ నిలిచిపోతుంది. ఒక మంచి సినిమాకి ఉండాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉన్నాయి. ఇందులో చంద్రకళ పాత్ర ప్రేక్షకుల మనసులో నిలిచిపోతుంది. కథ విన్నప్పుడు నేను చేసిన చంద్రకళ పాత్ర నాకు ఎంతగానో నచ్చింది. ఆ పాత్ర చేయడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఒక ఆడియన్ గా ఇలాంటి సినిమాలు చూడటనికి నేను చాలా ఇష్టపడతాను.

రోషన్ తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?

రోషన్ వెరీ స్వీట్. తను డైలాగ్స్, డ్యాన్స్ లో నాకు చాలా సపోర్ట్ చేశారు. తను స్వీటెస్ట్ కోస్టార్.

మీరు కెరీర్ బిగినింగ్ లోనే మోహన్ లాల్ తో పని చేశారు కదా.. ఎలా అనిపించింది?

నేను లాల్ గారికి పెద్ద ఫ్యాన్. ఆయనతో కలిసి నటించే అవకాశం రావడం నిజంగా చాలా గొప్ప అదృష్టం. ఆయనతో నటించడం అనేది ఒక లైఫ్ టైం మెమరీ. అలాగే రేఖా చిత్రం సినిమా చేయడం కూడా వెరీ మెమొరబుల్. ఎప్పటికీ గుర్తుండిపోయే క్యారెక్టర్ అది. ఆ సినిమా సమయంలో మమ్ముటీ గారితో ఆటోగ్రాఫ్ తీసుకోవడం కూడా ఫ్యాన్ గర్ల్ మూమెంట్.

హైదరాబాద్ ఫుడ్ నచ్చిందా?

చాలా నచ్చింది. చాలా స్పైసీగా ఉంటుంది. ఇక్కడ బిర్యానీ అంటే నాకు చాలా ఇష్టం

ఈ సినిమా ట్రైలర్ ని రామ్ చరణ్ లాంచ్ చేస్తున్నారు కదా.. ఎలా అనిపిస్తోంది

ట్రైలర్ ని రామ్ చరణ్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. రామ్ చరణ్ గారి మగధీర సినిమా అంటే నాకు చాలా ఇష్టం. ఆ సినిమాని ఎన్నిసార్లు చూశానో లెక్కలేదు.

తెలుగులో మీకు ఇష్టమైన స్టార్?

అల్లు అర్జున్ చాలా ఇష్టం.

మీరు తెలుగులో కొత్తగా చేస్తున్న సినిమాలు?

ఇట్లు మీ అర్జున చేస్తున్నాను. నిజానికి ఛాంపియన్ కంటే ముందే సైన్ చేసిన సినిమా అది. కాకపోతే ఛాంపియన్ ముందుగా రిలీజ్ అవుతుంది.



'శంబాల' రిలీజ్‌చేస్తున్న మైత్రి, ఉషా పిక్చర్స్

వెర్సటైల్ యాక్టర్ ఆది సాయి కుమార్ నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'శంబాల : ఎ మిస్టికల్ వరల్డ్'. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి యగంధర్ ముని దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో అర్చన అయ్యర్, స్వసిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ తదితరులు కీలక పాత్రల్ని పోషించారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన బిజినెస్ పూర్తయిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రంపై ఉన్న క్రేజ్, బజ్, డిమాండ్ మేరకు ఫ్యాన్సీ రేటుకే మేకర్స్ అమ్మేశారు. 'శంబాల' నుంచి ఇప్పటి వరకు రిలీజ్ చేసిన ప్రతీ కంటెంట్ ఆడియెన్స్‌లో అంచనాల్ని పెంచేసింది. ఇక సోషల్ మీడియాలో అయితే శంబాల మేకింగ్ వీడియో, టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా ట్రెండ్ అయ్యాయి. ఇక డిసెంబర్ 25 రాబోతోన్న 'శంబాల' బ్లాక్ బస్టర్ అని ట్రేడ్ సర్కిళ్లలో బలంగా వినిపిస్తోంది. దీనికి తగ్గట్టుగా భారీ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు 'శంబాల'ని అన్ని ఏరియాల్లో డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాయి. నైజాం ఏరియాలో మైత్రి, ఏపీ, సీడెడ్ ఏరియాలో ఉషా పిక్చర్స్ 'శంబాల' మూవీని భారీ ఎత్తున డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాయి. ఇక ఓవర్సీస్‌లో సైతం ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఓవర్సీస్ బాధ్యతల్ని మూన్ షైన్ సినిమాస్ తీసుకుంది. ఇక కర్ణాటకలో ఈ సినిమాను కుమార్ బెంగళూర్ ఫిల్మ్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఇప్పటికే 'శంబాల' క్రేజ్‌ను క్యాష్ చేసుకునేందుకు ఓటీటీ సంస్థలో ఆహా పోటీ పడి గెలిచింది. ఇక శాటిలైట్ విషయంలో జీ నెట్ వర్క్ ముందుండి హక్కులను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. సినిమా విడుదలకు ముందే నిర్మాతలు టేబుల్ ప్రాఫిట్స్‌లో ఉండటం విశేషం.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200